BALA CHELIMI

NOV 2025

BALA

NOV



₹40
నవంబర్ - 2025
PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 2

NOVEMBER - 2025




Editor : **Er. VEDAKUMAR MANIKONDA**
A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186, Behind SBH(H.O)
Gunfoundry, Hyd-1.
Ph: 66468646, 23203108

**AMEERPET**
Lane Opp. Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service

CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS






Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


| సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 2 | హైదరాబాద్ Hyderabad | నవంబర్ November | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|












లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| సంస్కారం మంచి భవిష్యత్తుకు పునాది | మణికొండ వేదకుమార్ | 5 |
| ప్రకృతి ప్రేమికుడు, జీవశాస్త్రవేత్త రాబర్ట్ డార్విన్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| తన కోపమే తన శత్రువు (ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్) | డా. నీరజ అమరవాది | 7 |
| డాక్టర్ ఇంద్రా నూయి | షీరోస్–256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| చిట్టి మేఘం (కథ) | భండారు విజయ | 11 |
| మంచి స్నేహం (కథ) | ఆదర్శ్ | 13 |
| పచ్చీసు (ఆట).. | చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మద్రి – 6 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| బొమ్మలేద్దామా... | | 16 |
| గెలుపుకు కారణం జట్టు (కథ) | కె.వి.సుమలత | 17 |
| కృత్రిమ మేధస్సులో కొత్త దశ ఏజెంటిక్ ఎఐ | లత | 18 |
| బౌద్ధ వారసత్వ ప్రదేశాలు...(యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి | 19 |
| నిమ్మకాయ నుంచి విద్యుత్తు (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| ఆడుకుందామా (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| నిజాయితీ (కథ) | పృథ్వీ | 23 |
| ఫిజిక్స్‌లో రెండుసార్లు నోబెల్ బహుమతి పొందిన ఏకైక శాస్త్రవేత్త జాన్ బర్డీన్ (సైన్స్ వెన్నెల-13) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| సీతాఫల చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| బాలల పండుగ (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| ఒలింపిక్స్ లక్ష్యంగా దూసుకెళ్తున్న తన్వీ శర్మ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| మీ వెహికిల్ నెంబర్ (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 28 |
| మంచి మార్పు (కథ) | శ్రీ చరిత | 29 |
| తెలివితక్కువ నక్క గొర్రెపోతుల పోరాటం | పంచతంత్ర కథ | 30 |
| శీతాకాలపు కథ (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| వేమన పద్యాలు | | 32 |
| తోకలేని నక్క (కథ) | కె. శ్రీలత రావు | 33 |

| | | |
|---|---|---|
| డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థలో నూతన దిశ | బాలచెలిమి డెస్క్ | 34 |
| రెండు వేల సంవత్సరాల నాటి సామాజిక పరిస్థితులు (చరిత్ర పాఠాలు-9) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| ఎఐతో పిల్లల ఊహాశక్తికి కొత్త రెక్కలు | బాలచెలిమి డెస్క్ | 36 |
| బొమ్మలకే ప్రాణాలొస్తే! (పాట) | డా. ఎన్. గోపి | 37 |
| బంగారం కల్తీ కనిపెట్టే సూత్రం | బాల కథా సౌరభం | 37 |
| గుడు గుడు గుంచెం (పాట) | గంగదేవు యాదయ్య | 38 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| పుస్తక పరిచయం | బాలచెలిమి | 39 |
| అంతరించిపోతున్న దక్షిణ జాయింట్ పెట్రేల్ పక్షి (పక్షి) | సచిన్ కోత్వాల్ | 40 |
| పేరాశ (కథ) | కె. లక్షణ | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం-చెలిమి | | 42 |
| నోబెల్ 2025 బహుమతి గ్రహీతలు (జి.కె.) | బాలచెలిమి డెస్క్ | 43 |
| బాలచెలిమి ఆత్మీయం భావితరానికి ఉషోదయం (ఆత్మీయం) | బైతి దుర్గయ్య | 44 |
| కడవేర్గు పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభం | గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ | 47 |
| మెదడుకి పదును పెట్టే పొడుపు కథలు (అక్షరాలతో ఆటలు) | డా. చొక్కాపు వెంకటరమణ | 48 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 49 |
| విభిన్న స్వరాల సృజనశీలి రావు బాలసరస్వతీ దేవి (వ్యక్తిత్వం) | సువేగా | 50 |


# చెలిమి లేఖలు

అందరికీ నమస్కారం! నా తల్లి భాషపై నాకు అపారమైన ప్రేమ ఉంది. అందుకే ఈ అభిప్రాయాన్ని మీతో పంచుకోవాలనిపించింది. ఈ సమయంలో మన యువతరానికి 'బాల చెలిమి' వంటి ప్రచురణలు అత్యంత అవసరం. పిల్లలకు సరళమైన మరియు ఆసక్తికరమైన కథల ద్వారా మంచి తెలుగు భాషను నేర్పించడానికి మీరు ఈ పత్రికను ప్రచురించడం అభినందనీయం. మీ సేవను ఇలాగే కొనసాగించండి. శుభాకాంక్షలతో,

**– కృష్ణారావు మెందు**

అక్టోబర్ సంచిక విజ్ఞానదాయకంగా, విద్యార్థుల మనోవికాసాన్ని పెంచే విధంగా రూపొందించబడింది. కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత ఆధునిక విద్యపై సమాచారం ప్రత్యేక ఆకర్షణ. పద్యం, కథలు, ఆటలు, పండుగలు, సైన్స్, కార్టూన్లు వంటి అంశాలు పిల్లలలో ఆసక్తిని పెంపొందిస్తాయి. మణికొండ వేదకుమార్ గారి "భౌగోళిక వైవిధ్యం జీవ వైవిధ్యానికి వెన్నెముక" అనే సంపాదకీయ వ్యాసం ద్వారా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విషయం విదితమవుతుంది. బాల చెలిమి పత్రిక విద్యార్థుల పాలిట ఒక కల్పతరువు.

**-తాడిచెర్ల రవి (తార)**

ఉపాధ్యాయులు పాలంపేట (రామప్ప), ములుగు

బాలచెలిమికి అభినందనలు! "దసరాకు డ్రెస్ వద్దు – బాలచెలిమి ముద్దు" అనే వినూత్న ఆలోచన ద్వారా గత నెలలో ZPSS లక్ష్మిపూర్ నుండి 7వ తరగతి విద్యార్థులైన సామ నాగలక్ష్మి, బోయర్ ప్రతిజ్ఞ, కంది మనోజ్ఞ, హెడావ్ రోహిత్‌కి చందా ద్వారా బాలచెలిమి పుస్తకాలు అందజేయడం జరిగింది. ఈ ప్రయత్నం ద్వారా విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తి పెరిగేందుకు మంచి మార్గం ఏర్పడింది.

**– ప్రధానోపాధ్యాయులు,** జెడ్‌పిఎస్ఎస్, లక్ష్మిపూర్

*Cover Picture*
TANVI SHARMA
US Open 2025
Women's Single Runner up



బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728


సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# సంస్కారం మంచి భవిష్యత్తుకు పునాది

పిల్లలూ.... మీ అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు.

ఈసారి మనం సంస్కారం గురించి మాట్లాడుకుందాం. భావము శుద్ధి చేయబడుట సంస్కారం అని పెద్దలు చెప్పారు. అనగా ఆలోచనలు సరిచేయబడుట, దిద్దుబడుట అని అర్థము. సంస్కారం నైతిక విలువలలో ఒకటి. సాధారణంగా సంస్కారం అంటే మంచి గుణాలు కలిగి ఉండటం. సంస్కారం అనేది వ్యక్తి మనసు, ప్రవర్తన మరియు జీవితాన్ని సరిచేసి లేదా శుద్ధి చేసి పరిపూర్ణత వైపు నడిపించే గుణాల సమాహారం.

ఇతరుల పట్ల గౌరవం చూపడం, మంచి పనులు చేసిన వారిని, విజయాలు సాధించిన వారిని అభినందించడం, మేలు చేసిన వారికి కృతజ్ఞతలు చెప్పడం, పొరపాట్లు, తప్పులు చేసిన వారిని క్షమించడం, అహంకారం చూపకపోవడం, ఇతరులను ద్వేషించకపోవడం, చెడుకు దూరంగా మంచికి దగ్గరగా ఉండటం సంస్కారం యొక్క లక్షణాలు. ఈ లక్షణాలు మన ప్రవర్తనలో కనిపిస్తుంటాయి.

కేవలం అధికారం వల్ల, డబ్బు వల్ల, పెద్ద పెద్ద చదువుల వల్ల, విద్వత్తు అనగా విశేష ప్రతిభ వల్ల సంస్కారం ఏర్పడదు. జీవి మనిషిగా ఎదిగే క్రమంలో మనిషి స్వభావమూ, ప్రవర్తన అలవడతాయి. ఈ అలవడటం అప్పటి సమాజ స్థితిగతులు, ఆలోచనలు, ప్రవర్తనలపై ఆధారపడి ఉంటుంది. దీనికి చదువుకునే చదువు, వినే మంచి మాటలు, బోధనలు, సాహిత్యము, సాంస్కృతిక విషయాలు దోహదం చేస్తాయి. ఇవన్నీ తల్లిదండ్రుల పెంపకం వల్ల, ఉపాధ్యాయుల బోధన వల్ల, పరిసరాల పరిజ్ఞానం వల్ల అభిరుచులుగా మారతాయి.

మంచి అభిరుచులు మంచి సంస్కారాన్ని నేర్పుతాయి. ఒకప్పుడు ఇంట్లో పెద్దవారు తాతయ్యలు, అమ్మమ్మలు కథలతో పిల్లల ఆలోచనల్ని తీర్చిదిద్దేవారు. బడిలో మోరల్ క్లాసులుండేవి. చిన్నతనం నుంచే పిల్లల ఉన్నతమైన వ్యక్తిత్వ నిర్మాణానికి, మంచి అలవాట్లకీ, క్రమశిక్షణకీ మార్గాలు వేసేవారు.

ఈ మారిన పరిస్థితులలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక ఆలోచనాపరులు పిల్లలలో క్రమశిక్షణ, మానవీయ స్పృహ, సంస్కారవంతమైన అలవాట్లు పెంపొందించే బాధ్యతను సక్రమంగా నిర్వహించాలి. ఉమ్మడి కుటుంబ సాంప్రదాయాన్ని పునఃప్రారంభించాలి.

సంస్కారం వ్యక్తిత్వ నిర్మాణానికి, భవిష్యత్ ఆలోచనలకు, మంచి సమాజ నిర్మాణానికి పునాది.



మీ

వేదకుమార్.యం


(మణికొండ వేదకుమార్)


ఎడిటర్ బాలచెలిమి



సైంటిస్ట్

# ప్రకృతి ప్రేమికుడు, జీవశాస్త్రవేత్త రాబర్ట్ డార్విన్





సృష్టి యొక్క సాంప్రదాయ దృక్పథాలను ప్రశ్నించిన జీవ శాస్త్రవేత్త చార్లేస్ రాబర్ట్ డార్విన్. డార్విన్ ప్రకృతి శాస్త్రవేత్త కూడా. డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండ్‌లో జన్మించారు. తండ్రి వారింగ్ డార్విన్ వైద్యుడు. డార్విన్ చిన్నప్పటి నుండి ప్రకృతి ప్రేమికుడు. తోటల వెంట తిరుగుతూ పూలను, కీటకాలను గమనించడం సేకరించడం ఇష్టంగా చేసేవాడు. చదువులపై ఆసక్తి లేదు, వైద్య విద్యను మధ్యలో వదిలేసాడు. అయితే ఆయనకున్న జిజ్ఞాస, పరిశీలనాశక్తి, గొప్ప శాస్త్రవేత్తగా తీర్చిదిద్దాయి. స్కూల్లో వున్న రోజుల్లోనే యూక్లిడ్ గణితం ట్యూషన్‌కి వెళ్లాడు. ఇంట్లోనే చిన్న ప్రయోగశాలలో రసాయన శాస్త్ర ప్రయోగాలు చేసేవాడు. సహజ చరిత్ర, భూగర్భ శాస్త్రం, శరీర నిర్మాణ శాస్త్రం, వేదాంత శాస్త్రం, గణిత శాస్త్రం పై అనేక ఉపన్యాసాలకు హాజరయ్యాడు. డార్విన్ అనారోగ్యంతో బాధపడుతున్నా చాలా క్రమశిక్షణగా జీవించాడు. రోజువారీ జీవితాన్ని చిన్న చిన్న విభాగాలుగా విభజించుకుని పనికి, విశ్రాంతికి సమ ప్రాధాన్యత ఇచ్చేవాడు. 1831లో ఒక పరిశోధనా యాత్రలో శాస్త్రవేత్తగా పాల్గొన్నాడు. ఐదేళ్ళ ఆ యాత్రలో వివిధ దేశాలు, ద్వీపాలు సందర్శించి వేలాది జీవులు, మొక్కల నమూనాలను సేకరించాడు. ఈ సేకరణ అతని సిద్ధాంతానికి ఆధారాలుగా నిలిచాయి. డార్విన్ సహజ ఎంపిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం జీవులు, తమ పరిసరాలకు అనుగుణంగా మార్పు చెందుతాయి. అంటే పరిసరాలకు అనుగుణంగా మారిన జీవులు మనుగడ సాగిస్తాయి. సహజ ఎంపిక వైవిధ్యం, అనుకూలత, మనుగడ మొదలైన అంశాలను బట్టి ప్రకృతి జీవులను ఎంపిక చేసుకుంటుంది. జీవ పరిణామం అనేది కాలక్రమంలో జీవులు అనుభవించే మార్పులను సూచిస్తుంది. ఒక జాతిలోని జీవులు కొన్ని తరాలలో మరింత సంక్లిష్టమైన జీవులుగా మారడాన్నే జీవపరిణామం అంటారు. ఈ మార్పులు సహజ ఎంపిక, జన్యుమార్పులు మరియు ఇతర కారణాల వల్ల సంభవిస్తాయి.

ఈ జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన డార్విన్ 'జీవ పరిణామ పితామహుడు'గా కీర్తిని సంపాదించాడు. డార్విన్ The Voyage of the Beagle (1839), On the Origin of Species (1859), The Structure and Distribution of Coral Reels (1842) గ్రంథాలు రచించారు. సత్యం కోసం అన్వేషణ, ఓపిక, సహనం, పట్టుదల, విమర్శలను స్వీకరించడం, సహకారం, ప్రకృతి పై ప్రేమ డార్విన్ నుంచి నేర్చుకోవలసిన అంశాలు. డార్విన్ 73వ ఏట 1882 ఏప్రిల్ 19న ఇంగ్లండ్‌లో మరణించాడు.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998




# తన కోపమే తన శత్రువు

"తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ,
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!"

పిల్లలూ సుమతీ శతక పద్యం ఇప్పుడు ఎందుకు అంటారా. ఆ.. మీకు ఈ పద్యం వచ్చని నాకు తెలుసు. మరి పద్యం భావం తెలుసా. సహనం, శాంతిని ఇస్తుంది. అసహనం అనేక నష్టాలకు కారణమవుతుందని పై పద్యం తెలియజేస్తుంది. భిన్న మతాలు, సంస్కృతుల పూలతోట మన భారతదేశం. దీనికి కారణం మన సహనం, శాంతి అని చెప్పకతప్పదు. ఈ చర్చ ఎందుకంటే, 1996 నుండి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదీని మనం ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్ పేరిట పలు కార్యక్రమాలను, వేడుకలను చేసుకుంటున్నాము.

'The highest result of education is tolerance.'
- Helen Keller

టాలరెన్స్ అంటే సహనం. సహనం అంటే మన ఇష్టాలకు ఎలా విలువ ఇచ్చుకుంటామో, ఇతరుల అభిప్రాయలకు అలాగే గౌరవించాలి. మీరు మీ స్నేహితులతో కొన్ని సార్లు పేచీ పడినా, వారి మాటలు నచ్చక పోయినా మరలా మాట్లాడుకుంటారు. ఒకవేళ మాట్లాడకపోయినా అంతగా నష్టం జరగక పోవచ్చు. మీరు పాఠ్యాంశాలలో భాగంగా ప్రపంచయుద్ధాల గురించి చదివే ఉంటారు. ఈమధ్య కాలంలో జరుగుతున్న యుద్ధాలను మీడియా ద్వారా తెలుసుకుంటున్నారు కదా. ఇలాంటి యుద్ధాల వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం చాలా జరుగుతుంది. చిన్నారుల జీవితాలు అల్లకల్లోలమైపోతాయి.

ఎన్నో యుద్ధాలను, వాటి వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను గమనించిన యునైటెడ్ నేషనల్ జనరల్ అసెంబ్లీ, సహనం అనేది ప్రజలు శాంతియుతంగా కలిసి జీవించడానికి సహాయపడే లక్షణం అని గ్రహించింది. అసహనం వల్ల కలిగే అనర్థాలపై విశ్వమానవాళికి అవగాహన కల్పించాలని నిర్ణయించుకుంది. అంతే కాక స్వేచ్ఛ అనే పావురానికి ఓర్పు, సహనం రెండు రెక్కల లాంటివని భావించింది.

మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ ఉద్యమాల ప్రభావాన్ని, ఫలితాలను చూసిన 'యునెస్కో' సహనం ప్రాముఖ్యత గురించి అవగాహనను పెంచడానికి '125వ గాంధీ జయంతి' సందర్భంగా 1995న 'అంతర్జాతీయ సహన దినోత్సవం' జరుపుకోవాలని పిలుపునిచ్చింది. యునెస్కో యొక్క డిక్లరేషన్ ఆఫ్ ప్రిన్సిపల్స్ వార్షికోత్సవం నవంబర్ 16. కనుక ఆ రోజునే 'అంతర్జాతీయ సహనదినోత్సవాన్ని' జరుపుకుంటున్నాము.


1995లో 'మదన్ జీత్ సింగ్' ఈ వేడుకల కోసం ఎన్నో నిధులు సమకూర్చారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఆయన పేరు మీద అవార్డ్ ఇస్తుంది. సహనం, అహింసలను ప్రచారం చేసిన వ్యక్తులు లేదా సంస్థలకు 'మదన్ జిత్ సింగ్ అవార్డ్' కింద లక్ష డాలర్ల నగదును కూడా ఇస్తారు.

ఆ దినోత్సవ సందర్భంగా పలు సంస్థలు, కార్యాలయాలు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఉపన్యాసాలతో పాటు, చిత్రలేఖనం, కవితలు, నృత్యపోటీలను పెట్టి బహుమతులను ప్రదానం చేస్తారు.

ఎవరికైనా సహనం జీవన విధానంలో భాగం కావాలి. ఇతరులను సముచితంగా గౌరవించడం, వారి అభిప్రాయాలను అర్థం చేసుకోవడం కూడా సహనమే. బుద్ధుడు, అంబేద్కర్ కూడా తమ ప్రసంగాలలో సహనం యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పారు. సహనం ఒక సుగుణం. దాని వల్ల పాజిటివ్ ఆలోచనలు వస్తాయి. పాజిటివ్ ఆలోచనల వల్ల అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చు. కనుక పిల్లలూ ఎప్పుడైనా ఓటమి ఎదురైనా, ఏ విషయంలో నైనా వెనుకడుగు వేయల్సివచ్చినా కోపం తెచ్చుకోకుండా ఆలోచించండి. ఓటమికి భయపడి, సహనం కోల్పోతే 'ఎడిసన్' బల్బ్ కనుగొనే వాడా? బల్బ్ అనే కాదు ఏదైనా కొత్త ఆవిష్కరణకి, లేదా ఒక గొప్ప విజయానికి సహనం చాలా కావాలి. కనుక పిల్లలూ సహనాన్ని శ్వాసలో భాగంగా చేసుకుందాం. అసాధ్యాలను సుసాధ్యం చేసుకుందాం.

"Tolerance is nithing more than patience with boundaries". - Shanon Alder

– డా. నీరజ అమరవాది
m : 9849160055




# డాక్టర్ ఇంద్రా నూయి

## వ్యాపార నాయకురాలు, వ్యూహాత్మక ఆలోచనాపరురాలు

ఇంద్రా నూయి (1955 అక్టోబర్ 28–) ప్రఖ్యాత భారతీయ – అమెరికన్ వ్యాపార ఎగ్జిక్యూటివ్, కార్పొరేట్ ప్రపంచంలో అసాధారణ నాయకురాలిగా ఆమె పేరు పొందారు.

1955లో చెన్నైలో పుట్టిన ఆమె 2006–2018 మధ్య కాలంలో పెప్సికో అధ్యక్షురాలిగా, సిఈఓగా అందరికీ సుపరిచితురాలు, తన పదవీ కాలంలో కంపెనీ పునర్నిర్మాణానికి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార విస్తరణ చేసే క్రమంలో ఆరోగ్యకరమైన ఆహారం, పానీయాల తయారీపై దృష్టి పెట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కలకత్తా నుంచి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్–గ్రాడ్యుయేట్ డిప్లొమా, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని యేల్ విశ్వవిద్యాలయం నుంచి పబ్లిక్ – ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు.




మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్‌తో నూయి తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అనేక కంపెనీలలో ఎగ్జిక్యూటివ్ బాధ్యతలు నెరవేర్చారు. కార్పొరేట్ రంగంలో ఆమె చూపిన ప్రభావం గాఢమైంది, స్ఫూర్తిదాయకమైంది. ఫార్చ్యూన్, ఫోర్బ్స్, సిఈఓ వరల్డ్ లాంటి ప్రఖ్యాత సంస్థలు ప్రకటించే ర్యాంకింగుల్లో ఉన్నత స్థానంలో ఆమె అనేక సంవత్సరాలు నిలిచారు. ఆమె చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా అనేక విశ్వవిద్యాలయాలు ఆమెకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. ఫార్చ్యూన్ 50 కంపెనీకి నాయకత్వం వహించిన మొదటి ప్రవాస భారత మహిళ నూయి. భారత దేశంలో గ్లోబల్ కార్పొరేట్ నాయకురాలిగా ఆమె సాగించిన ప్రయాణం చాలా మందికి స్ఫూర్తిని ఇస్తుంది. వ్యాపార ప్రపంచంలో మహిళా సాధికారత కోసం ఆమె గట్టి కృషి చేశారు.

– 'షీరోస్–256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?


ఇంద్రా నూయి రాసిన 'మై లైఫ్ ఇన్ ఫుల్: వర్క్, ఫ్యామిలీ అండ్ అవర్ ఫ్యూచర్' పుస్తకంలో నాయకత్వం, వ్యాపారం, కుటుంబ బాధ్యతల మధ్య సమతౌల్యం సాధించిన తన అనుభవాలు పంచుకున్నారు.



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం




**జ**గములో జనులు మంచిని పెంచాలి
**జం**కు గొంకు లేకుండ జయము పొందాలి
**జ**నగణ, జంగము, జంగలి, జడలో
ఏ అక్షర ముందర ఉందో చెప్పండి? "**జ**" అక్షరం



**ఝ**ంపమంటే దుంకుటని తెలుసా?
**ఝ**రమంటే సెలయేరని తెలుసా?
**ఝ**షమంటే చేప, మొసలని తెలుసా?
ఈ వాక్యాల్లో ముందర ఏ అక్షర ఉందో చెప్పండి? "**ఝ**" అక్షరం

'**ఞ**' ఇది ఒక అక్షరమని తెలుసా?
'**ఞ**' ని పలుకు కష్టమని తెలుసా?
'**ఞ**' అంటే "ఎద్దని" తెలుసా?
'**ఞ**' ఈ అక్షరాన్ని ఏమంటారు? "**ఞ**" అక్షరం





**ట**క టక టపాకాయ ముట్టించు
'**టం**టం" అనే చప్పుడు విన్నారా?
'**ట**మాట' పండు ఏ రంగులో ఉందీ?
'**ట**మాట' ముందు వెనుక ఏ అక్షరముందీ "**ట**" అక్షరం

'**ఠ**విణ' అంటే డంక అని తెలుసా?
'**ఠ**వళి' యంటే అబద్ధమని తెలుసా?
'**ఠ**వర' అంటే నేర్పరని తెలుసా?
'**ఠ**వర'లో మొదటి అక్షరమేది? "**ఠ**" అక్షరం



– డా।। జనపాల శంకరయ్య
m : 8074727108



క
థ

# చిట్టి మేఘం



"అమ్ములూ ఇక్కడ కూర్చొని ఏం చూస్తున్నావు? ఇంట్లోకి రా తల్లీ!" అంది చిట్టి తల్లి.

దీర్ఘంగా ఆకాశం వైపు చూస్తున్న చిట్టి తన తల్లివైపు ఓ అమాయక చూపు చూసి, మిలమిలా మెరుస్తున్న కళ్ళతో మళ్ళీ ఆకాశం వైపు తన దృష్టి సారించింది.

దానికి ఆకాశం నిండా మెరుపులు రంగురంగులుగా కనబడుతున్నాయి. వాటివైపే పారవశ్యంతో చూస్తూ తనలో తానే మురిసిపోతోంది.

సాయం సంధ్యా సమయం అవుతోంది. బిడ్డ ఇంకా ఇంట్లోకి రాకుండా బయట అరుగు మీద కూర్చొని ఏం చేస్తోందబ్బా అనుకుంటూ వచ్చిన తల్లికి చిట్టి తదైకాత్మతో ఆకాశం వైపే చూడడం కనిపించింది.

"చిట్టీ! పైన ఏం కనబడుతోంది" అడిగింది తల్లి.

చిట్టి తల్లివైపు చూడకుండానే "అమ్మా మెరుస్తున్న ఆ మేఘాలన్నీ ఎక్కడికి వెళ్తున్నాయి" అడిగింది.

"అవి వాళ్ళ అమ్మ పిలుస్తోందని ఇంటికి వెళ్తున్నాయి" అంది.

"వాళ్ళ ఇల్లు ఎక్కడ?"

"వాళ్ళ అమ్మ ఎక్కడ ఉంటే అక్కడ."

"వాళ్ళ అమ్మ ఎక్కడ వుంది? అయినా, మేఘాలు వాళ్ళ ఇంటికి వెళ్లకపోతే ఏమౌతుంది?"

"గాలి వచ్చి మేఘాన్ని ఎత్తుకుని వెళ్ళిపోతుంది."

"నువ్వు కథలో చెప్పే బూచోడిలానా?"

"అవునూ..."

"అమ్మో! ఎత్తుకుని వెళ్లి ఏం చేస్తుందమ్మా?"

"మింగేస్తుంది తల్లీ!"

"అమ్మో! దాని అమ్మ చూస్తే కొడుతుంది కదా!"

"గాలి కనబడితే కదా వాళ్లమ్మ కొట్టేది."

"అవును.. మరి వాళ్ళ అమ్మ ఏడవదా?"

"ఎందుకు ఏడవదూ.. ఏడుస్తుంది."

"ముందు వెదుకుతుంది. ఆ తర్వాత పోలీసులకు చెబుతుంది..."

"అమ్మో! పోలీసులా? పోలీసులు కొడుతారా?"

"తప్పు చేస్తే కొడుతారుగా మరి..."

"మేఘాన్ని కూడా కొడతారా?"

"గాలిని కొట్టి, మేఘాన్ని ఎందుకు తెచ్చావని అడుగుతారు."

"మరి మేఘాన్ని?"

"అమ్మను వదిలి నువ్వు బయటకు ఎందుకు వచ్చావు? అలా బయటకు వస్తే బూచోడు ఎత్తుకు వెళ్తాడు. అలా అమ్మకు చెప్పకుండా రావద్దు అని కోప్పడతాడు"

"అమ్మో! పాపం మేఘం" అంది జాలిగా..

"మరి నువ్వు కూడా వెళ్తావా అమ్మకు చెప్పకుండా ఎక్కడికైనా" అడిగింది తల్లి.

"నో.. నో.. వెళ్ళను" అంది చిట్టి బిగ్గరగా.

"మరి రా ఇంట్లోకి..."

"అమ్మా! చందమామ ఎప్పుడొస్తాడు" మళ్ళీ ప్రశ్న వేసింది చిట్టి.

"ఇప్పుడు రాడమ్మా! నువ్వు అన్నం తిని, అల్లరి చేయకుండా కాసేపు చదువుకుని, పడుకుంటే అప్పుడు నిన్ను చూడడానికి వస్తాడు" అంది తల్లి అంతే ఓపిగ్గా..

చిట్టి తల్లి వైపు చూస్తూ... "అమ్మా! మేఘానికి ఆకలేస్తుందిలా వుంది... చూడూ ఆ మేఘం వాళ్ళ అమ్మ దగ్గరికి పరుగేత్తుతోంది కదూ..."

"అవునూ.. మరి నువ్వు కూడా ఇంట్లోకి రా... అన్నం తిందువు గానీ..."

"సరే అమ్మా!" తల్లి ఒడిలో చేరి కూర్చుంది చిట్టి.

తల్లి బిడ్డను దగ్గరికి తీసుకుని ముద్దాడుతూ... "అలా మేఘంలా ఎప్పుడూ నాకూ చెప్పకుండా బయటకు వెళ్ళకూడదు సరేనా" అంది.

"సరే అమ్మా!" అంది చిట్టి.

చిట్టిని ముద్దాడుతూ లోపలికి తీసుకెళ్ళింది అమ్మ.

పైన పరుగెడుతున్న మేఘాలు ఒక్కోసారి ఆగిపోయి తన వైపు చూస్తున్నాయి.

రెండు చేతులు చాచి వాటిని పిలిచింది చిట్టి. అవి మెల్ల మెల్లగా కదులుతూ తన మీదకు వస్తుండడంతో భయంతో లేచి కూర్చుంది చిట్టి.

తల్లి వచ్చి, ఆరుబయట కూర్చొని నిద్రపోతున్న చిట్టీని ఎత్తుకుని ఇంట్లోకి తెచ్చింది. మంచం మీద పడుకోబెట్టి, దుప్పటి కప్పింది. తనూ పడుకుంది.

"అమ్మా! నీకు తెలియకుండా ఆ మేఘంలా నేను ఎక్కడికి వెళ్ళనమ్మా!" కలవరిస్తోంది చిట్టి.

కలలో పలవరిస్తున్న చిట్టికి దగ్గరగా జరిగి, గట్టిగా హత్తుకుంది తల్లి.

– భండారు విజయ
8801910908

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

కథ

# మంచి స్నేహం



ఒకానొకప్పుడు ఒక చెట్టుమీద ఒక పావురం ఉంటుండేది. దానికి ఒక కోడిపుంజుకు మంచి స్నేహం. ఆ పుంజు దగ్గరలో నున్న పూల తోటలో ఉండేది. అవి ప్రతీ సాయంత్రం కలుసుకుని సరదాగా కబుర్లు చెప్పుకొనేవి.

'ఒక రోజు చాలా ఆకలితోనున్న తోడేలు ఒకటి ఆ పూల తోటలోకి వచ్చింది. తినడానికి అక్కడ ఏమైనా దొరుకుతుందేమోనని వెతకసాగింది. ఇంతలో దానికి కోడిపుంజు కన్పించింది. "ఈ కోడి చక్కగా బలిసి ఉంది. దీన్ని ఎట్లైనా చంపితినాలి" అనుకొంది. మెల్లగా వెళ్ళి ఆ కోడిపుంజును పట్టుకొని తన సంచిలో వేసుకొని పారి పోసాగింది. కోడి భయంలో సంచిలో నుండి అరుస్తోంది. చెట్టుపైన కూర్చొన్న పావురం జరిగినదంతా చూసింది. వెంటనే ఒక ఉపాయం ఆలోచించింది. తోడేలు కంటే ముందుగా ఎగిరి వెళ్ళి అది పోయే దార్లో చచ్చిన దానిలాగా పడుకొంది. దారిలో పడి ఉన్న ఆ పావురాన్ని తోడేలు చూసింది. "ఆహా! ఏమి అదృష్టం నాది! ఒక కోడి, ఒక పావురం నాకు దొరికాయి. ఇవ్వాళ నుంచి విందు భోజనం చేస్తాను." అనుకొంది, చేతిలో నున్న సంచిని క్రింద పెట్టి పావురాన్ని తీద్దామని దాని దగ్గరగా వెళ్ళింది. మంచి సందు దొరికింది" అనుకొని కోడి వెంటనే సంచిలో నుండి బయటకి వచ్చి, ఆ సంచిలో ఒక రాయిని పెట్టి తాను వెళ్ళి ప్రక్కనే ఉన్న పొదలో దాక్కుంది.

తోడేలు పావురాన్ని పైకి తీద్దామని వంగింది. ఈ లోగా, పావురం తుర్రుమని ఎగిరిపోయింది! "ఓసి! దొంగ పావురమా! ఎంత మోసం చేసావే" అనుకొంటూ సంచిని భుజాన వేసుకొని యింటికి చేరింది.

ఆ రోజుకు ఆ కోడితోటే సరిపెట్టుకుందామని సంచి తెరిచింది. అంతే! గుండె గుభేలుమంది! కోడి లేదు గాని ఒక రాయి ఉంది. "కోడి రాయిగా ఎట్లా మారిందబ్బా ఇప్పుడు నేనేం తినాలి." అనుకుంటూ ఏడుస్తూ కూర్చోంది. కోడి, పావురం ఒక చోట చేరి తోడేలు తెలివి తక్కువ తనానికి నవ్వుకున్నాయి.

***నీతి : అత్యాశ అవమానపాలు చేస్తుంది. ఇద్దరు స్నేహితులు ఒకరికొకరు సహాయ పడుతారు. స్నేహం గొప్పది.***

– ఆదర్శ్
8వ తరగతి, విజయ్ ఉన్నత పాఠశాల, నిజామాబాద్.
m : 7396651555

ఆట

# పచ్చీసు



**ఎంత మంది పాల్గొన వచ్చు –**
**నలుగురు లేదా ఆరుగురు**

**ఎక్కడ ఆడవచ్చు –**
**ఇంట్లోనైనా, బయటైనా**

'పచ్చీసు' మాటకు హిందీ భాషలో ఇరవై అయిదు అని అర్థం. పచ్చీసు అంటే... ఆటలో కాసే ఓ పందెం సంఖ్య. ఈ ఆటను స్త్రీలు ఎక్కువగా ఆడతారు. నలుగురు లేదా ఆరుగురు ఆడుకోవచ్చు. నలుగురు ఎవరి ఆట వాళ్ళు ఆడుకోవచ్చు లేదా జట్టుగా కూడా ఆడుకోవచ్చు.

**ఆడే పద్ధతి :**

పచ్చీసు ఆడే గుడ్డ నాలుగు వైపులా పట్టీలతో కుట్టి ఉంటుంది. కొందరు తమ ఇళ్ళలో గచ్చుపై చెక్కుతారు. లేదా ఆడుకునే సమయంలో సుద్ద ముక్కతో గీసి ఆడతారు. పచ్చీసు ఆటలో పందెం వేయటానికి ఏడు గవ్వలను వాడుతారు. మొత్తం పదహారు కాయలుంటాయి. ఆటలో నలుగురు... ఒక్కొక్కరు నాలుగు కాయల చొప్పున తీసుకుంటారు. కావున నాలుగు రంగులు వేరువేరుగా ఉంటాయి. సామాన్యంగా ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నలుపు రంగుల్లో కాయలుంటాయి. వీటిని పావులు అని కూడా అంటారు.


పచ్చీసు గుడ్డను నేలమీద పరచి దానికి నాలుగు వైపుల నలుగురు కూర్చొని గవ్వలతో పందెం వేస్తారు. మొదటి పందెం దేవడికని, రెండవది దెయ్యానికని వదిలి మూడవ పందెం నుండి ఆట మొదలవుతుంది. దస్, తీస్, పచ్చీస్ పడినప్పుడే పావులు ఆటలోకి వస్తాయి. పందెం గుండి వైపు నుంచి ఆట మొదలవుతుంది. గడిలో చేరిన పావుల్ని చంపరాదు. అదే రకంగా ఆట ఆఖరిలో తల్లి ఇల్లు చేరే ముందు ఒకటి, రెండు, మూడు సంఖ్యలో పంచెం పడనట్టయితే ఒక పందెం వదిలి వేస్తారు. ముందు వాళ్ళు తల్లి గడి వైపు వెళ్ళే లోపల వట్టి చోట్ల ఉండే వారి తరువాత వారు ముందు కాయను చంపుతారు. ఈ పందాల విలువ పచ్చీస్ పడాలని కోరుకుంటారు. ఎవరు ముందుగా ఇల్లు చేరితే, చుట్టూ నాలుగు వైపులా పూర్తి చేయగలిగితే వాళ్ళు ఆటలో ముందుగా గెలుపొందినట్లు. ఆసక్తితో పాటు కాలక్షేపం కూడా కలిగించే ఆట ఇది. వేసవి సెలవుల్లో పిల్లలు ఎండలో కాకుండా నీడపట్టున ఉండేందుకు ఈ ఆటలను పెద్దవాళ్ళు ఆడించేవారు.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

✦ సీరియల్-6

# బంగారు ముర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)



(గత సంచిక తరువాయి...)

అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న రిసార్ట్స్‌కు వేగంగా దూసుకు వచ్చింది జీపు. దూరం నుంచే గమనించిన రిసార్ట్స్‌లో చిన్న పని చేసే అబ్దుల్ ఖాదిర్ జీపుకు ఎదురెళ్ళాడు.

జీపులోంచి టైగర్ ట్రాకర్, బీట్ ఆఫీసర్ దిగారు.

"నమస్తే ఆఫీసర్ సాబ్! మంచిగున్నరా!"

"నమస్తే ఖాదిర్ భాయ్! నీతో పనుండి వచ్చా!"

"చెప్పండి సాబ్! ఏదో పరేషాన్లో ఉన్నట్టు కొడుతుంది!?"

"నీతో పని పడింది. ఇలా పక్కకు రా..."

జేబులోంచి రెండు వేలు తీసి ఖాదిర్ జేబులో పెట్టాడు.

"వద్దు సాబ్! పనేందో చెప్పండి. నెలనెలా పైసలిస్తునే ఉన్నరు కదా!" డబ్బు జేబులో తడుముకుంటూ అన్నాడు.

"ఖాదిర్! నిన్న రాత్రి అడవిలోకి దుండగులు ప్రవేశించి ఏదో జంతువుని చంపి మద్యం తాగుతూ, మంటల్లో మాంసం కాల్చుకు తిన్నారు. ఆ జీపు మీ రిసార్ట్స్ మీదుగా వెళ్లినట్టు సి.సి.కెమేరాలో రికార్డయింది.

"అచ్చా! జీపు నెంబరు చెపుతరా?"

"నెంబరు ప్లేటు లేని జీపులో ఆయుధాలతో వచ్చారు. నాకు మీ రిసార్ట్స్‌లో గత వారం రోజులుగా ఎవరు ఉన్నారో గెస్ట్ వివరాలు కావాలి!"

"రండి సాబ్! చూపిస్తా! ఛాయ్ తాక్కుంటా మాట్లాడుదాం" ఇద్దరూ రిసెప్షన్ హాల్‌కు వెళ్లారు.

ఇంతలో టైగర్ ట్రాకర్ పరుగున వచ్చి "సార్! ఆ చివర ఉన్న జీపుకు నెంబరు ప్లేటు లేదు!" అన్నాడు. ఇద్దరూ రిసెప్షన్ హాల్ నుంచి బయటకు వచ్చారు.

"ఖాదిర్ ఆ జీపు ఎవరిది!?"

"అది మనదే సాబ్! బండి వాషింగ్ చేసి ఎండకు పెట్టినం" అని జీపు దగ్గరికి నడిచారు. అక్కడ ఒక పనివాడు జీపు తుడుస్తున్నాడు. "అరే.. క్యాహువా మియా! అబీతక్ నంబర్ ప్లేట్ నైలగాయా!?" అంటూ అరిచాడు.

"ప్లేట్ ఊడింది సాబ్! వాషింగ్ ఐనాంక ఫిట్

చేయమని చెప్పా!" అన్నాడు బీట్ ఆఫీసర్ కళ్లలోకి చూస్తూ ఖాదిర్.

"అరే.. మియా! జల్దీ లగావ్!"

"ఖాదిర్! రిసార్ట్స్ నుంచి ఒక్కరు కూడా బయటకు పోవటానికి వీలులేదు. మెయిన్ గేట్ క్లోజ్ చేయండి!" అన్నాడు బీట్ ఆఫీసర్.

టైగర్ ట్రాకర్ మెయిన్ గేటు మూయించటానికి వెళ్లాడు.

"సాబ్! నేను మీ ఇన్ఫార్మర్‌ను. మనతాన అట్లుండదు" అన్నాడు.

అటవీశాఖ అడవి చుట్టూత పల్లెల్లో ఇన్‌ఫార్మర్‌ను నియమించుకొని ఆ ఇన్‌ఫార్మర్ ద్వారా స్మగ్లర్లు, వేటగాళ్ల కదలికలపై దృష్టి పెట్టింది. ఇన్‌ఫార్మర్‌ల నుంచి సమాచారం అందగానే అటవీ సిబ్బంది అప్రమత్తమై అన్ని ముందు జాగ్రత్తచర్యలతో దాడులు చేస్తుంది. ఐతే అన్ని చోట్ల మంచివారితోపాటు, చెడ్డవారూ ఉన్నట్లు స్మగ్లర్లు, వేటగాళ్లకు స్థానికుల, ఇన్‌ఫార్మర్‌ల సహకారం లభిస్తుండడం జరుగుతోంది. గతంలో చాలాసార్లు స్థానికుల సహకారం తోనే కొంత మంది స్మగ్లర్లు అటవీశాఖ సిబ్బందిపైనే కాకుండా ఉన్న తాధికారులపైనా దాడులకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అందుకే ఎవరినీ పూర్తిగా నమ్మటానికి వీలు లేదు.

బీట్ ఆఫీసర్ పోలీసులకు ఫోన్ చేస్తే ఏ విషయం చెప్పి సహకారం కోరాడు. పది నిమిషాల్లో పోలీసు సిబ్బంది జీపులో రిసార్ట్‌కు వచ్చారు. ఎస్.ఐ. గెస్ట్ లిస్ట్ తీసుకున్నాడు. పోలీసులు ఇద్దరు ఒక్కో రూమ్ తనిఖీ చేశారు. ఒక రూమ్‌లో పనివాడు క్లీన్ చేస్తూ కనిపించాడు. పోలీసులు పనివాడిని బయటకు పంపి ఆ గది పరిశీలించారు. అక్కడ ఖాళీ మద్యం సీసాలు, కాల్చి పారేసిన సిగరెట్ పీకలు దర్శనమిచ్చాయి. ఆ సిగరెట్ పీకలతో పాటు ఒక పులిగోరు కనిపించింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆ పులి గోరుని, మద్యం సీసాలను, సిగరెట్ పీకలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్‌కు పంపించాడు.

నిన్న అడవిలో దొరికిన మద్యం సీసాల మీది వేలిముద్రలతో పోల్చి చూస్తే నేరస్తులు దొరికిపోవచ్చు.

"ఖాదిర్! ఈ గదిలో ఎవరు దిగారు?" 306 ఎ రూము చూపిస్తూ అడిగాడు బీట్ ఆఫీసర్.

"మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన టూరిస్ట్‌లు సాబ్!"

"306 ఎ రూమ్ దిలీప్ సింగ్ చౌహాన్ పేరుతో బుక్ ఐంది" అన్నాడు లిస్ట్ చూస్తూ ఎస్.ఐ.

"అవును సాబ్! వాళ్లు నిన్న సాయంత్రమే చెక్ ఔట్ చేశారు" అన్నాడు ఖాదిర్.

బీట్ ఆఫీసర్ ఖాదిర్ కళ్లలోకి చూశాడు.

ఖాదిర్ ఏమాత్రం తడబడకుండా ధైర్యంగా, తెలివిగా సమాధానాలిస్తున్నాడు.

ఎస్.ఐ. తిరిగి రిసెప్షన్ చేరుకున్నాడు. కంప్యూటర్ తీసుకుని 306ఎ రూము చెక్ ఔట్ చేసిన వారి ఫోటోలు, ఆధార్ కార్డులు పరిశీలించాడు.

అంత చలిలోనూ ఖాదిర్‌కు చెమటలు పట్టాయి.

(సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

## బొమ్మలేద్దామా...



పి. వర్షిక
8వ తరగతి, సెయింట్ పీటర్స్ హై స్కూల్, సికింద్రాబాద్

కథ

# గెలుపుకు కారణం జట్టు



పల్లవి మూడవ తరగతి చదువుతోంది. చాలా మంచి అమ్మాయి. బాగా చదువుతుంది అలాగే ఆటల్లోనూ ముందుంటుంది. కానీ తోటి పిల్లలతో అసలు కలవదు. తనేమిటో, తన పనేమిటో అన్నట్లు ఎప్పుడూ ఒక్కతే ఉంటుంది. పక్కనున్న పిల్లలు పలుకరించినా పొడిపొడిగా సమాధానం చెప్తుంది. ఆమె దగ్గరున్న వస్తువులు ఎవరైనా అడిగినా ఇవ్వడానికి ఇష్టపడదు. అలాగే తనకి అవసరమైనా ఎవరి దగ్గర నుండీ ఏమీ అడగదు.

"అలా ఒక్కదానివే ఉండకూడదు, తోటి పిల్లలతో కలిసి మెలిసి ఉండడం ఇప్పటి నుండే అలవాటు కావాలి" అని వాళ్ళ అమ్మ ఎంతగానో చెప్తోంది.

"నాకు వాళ్ళు నచ్చడం లేదమ్మా!" పిర్యాదులు చేస్తోంది పల్లవి.

"అలా ఎవరి మీద పిర్యాదులు చేయకూడదు. స్నేహితులతో గొడవ పడకూడదు" నచ్చజెప్తుంది అమ్మ.

ఒకసారి పల్లవికి బడిలో పరీక్షలు జరుగుతున్నాయి. పల్లవి బడికి వెళ్తున్న ఆటో సగం దూరం వచ్చేసరికి ఉన్నట్లుండి ఆగిపోయింది. పల్లవి పరీక్షా సమయం అవుతుందని కంగారుతో బిక్క మొహం వేసుకుంది. అప్పుడే పల్లవితో పాటు చదువుకునే స్నేహ వాళ్ళ డాడీతో బండి మీద వెళ్తోంది. పల్లవిని చూసి అక్కడ బండి ఆపించింది.

"ఏమైంది పల్లవీ! ఇక్కడెందుకున్నావు?" అని అడిగింది.

"ఆటో పాడయిపోయింది" అంది పల్లవి.

"అయితే మాతో పాటు నువ్వు కూడా రా" అని బలవంతంగా పల్లవి చెయ్యి పట్టుకుని బండి ఎక్కించింది స్నేహ.

పల్లవికి ఆ సమయంలో స్నేహ అడగకుండానే సహాయం చేయడం సంతోషం కలిగించింది. ఆ సాయంత్రం ఇంటికి వచ్చాక పల్లవి జరిగింది వాళ్ళ అమ్మతో చెప్పింది.


"స్నేహ కలివిడిగా ఉండటం వల్ల నువ్వు అడగక పోయినా నిన్ను బడికి తీసుకువెళ్ళింది. లేకపోతే నువ్వు పరీక్ష రాయగలిగే దానివి కాదు. మనకు మనం గిరి గీసుకుని ఉండకూడదు. అందరితో సంబంధాలు పెంచుకోవాలి. మనకు చేతనైన సహాయాన్ని పంచుకోవాలి. ఒక జట్టులో ఉత్తమంగా ఉంటే అన్ని చోట్ల గెలువగలం" అంది అమ్మ.

అప్పటి నుండి పల్లవి ప్రవర్తనలో మార్పు మొదలైంది. అందరితో కలిసి ఆడుకుంటోంది... స్నేహంగా ఉండసాగింది.

– కె.వి.సుమలత
గుడివాడ, కృష్ణ–521301
m : 9492656255

విద్య

# కృత్రిమ మేధస్సులో కొత్త దశ
# ఏజెంటిక్ ఎఐ




ఏజెంటిక్ AI అనేది కృత్రిమ మేధస్సు పరిణామంలో కొత్త దశ. ఇది కేవలం ఆదేశాలను అనుసరించే AI కాదు; స్వతంత్రంగా ఆలోచించి, ప్రణాళికలు రూపొందించి, చర్యలు తీసుకోగల సామర్థ్యంతో కూడిన వ్యవస్థ. ఈ సాంకేతికత మనుషుల పనికి తోడ్పడుతూ, వారిని మరింత సృజనాత్మకత మరియు వ్యూహాత్మక ఆలోచన వైపు దారి చూపుతుంది.

### ముఖ్య లక్షణాలు

- తార్కిక ఆలోచన
- దశలవారీ ప్రణాళిక తయారీ
- స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం
- సవాళ్లు ఎదురైనప్పుడు పరిష్కార మార్గం అన్వేషణ

### ఎలా పని చేస్తుంది?

ఉదాహరణ: "నివేదిక సిద్ధం చేయి" అనే ఒక ఆదేశాన్ని తీసుకుంటే:

- సంబంధిత డేటాబేస్‌ల నుండి సమాచారాన్ని సేకరిస్తుంది
- ముఖ్యమైన ధోరణులను విశ్లేషించి సంగ్రహిస్తుంది
- గ్రాఫ్‌లు, విజువల్స్ రూపంలో అందుబాటులోకి తెస్తుంది
- షెడ్యూల్ ప్రకారం నివేదికను సమర్పిస్తుంది

ఈ మొత్తం ప్రక్రియలో, AI స్వతంత్రంగా పని చేస్తూ, మన అవసరాలకు అనుగుణంగా ఫలితాలను అందిస్తుంది.

### ఏజెంటిక్ AI ఎక్కడ ఉపయోగపడుతుంది?

- ఆరోగ్య రంగం – వ్యాధి నిర్ధారణ, రోగుల పర్యవేక్షణ
- ఆర్థిక రంగం – పెట్టుబడి వ్యూహాల ఆటోమేషన్
- విద్య – విద్యార్థులకు అనుకూలమైన వ్యక్తిగత అభ్యాస ప్రణాళికలు
- కస్టమర్ సర్వీస్ – సమస్య పరిష్కార చాట్‌బాట్‌లు
- పరిశోధన – డేటా విశ్లేషణ, సిమ్యులేషన్

### మానవులకు ఎందుకు అవసరం?

- మానవ శ్రమ తగ్గింపు
- సమయం ఆదా
- సృజనాత్మకత కోసం ఎక్కువ సమయం
- నిర్ణయాలు త్వరగా, సమర్థవంతంగా తీసుకోవడం

### భవిష్యత్తు అవకాశాలు

- AI ప్రాజెక్ట్ మేనేజర్లు
- ఆరోగ్య రంగంలో ఔషధ ఆవిష్కరణలు
- భాషా అడ్డంకులను తొలగించే గ్లోబల్ కమ్యూనికేషన్ ఏజెంట్లు
- నైతికత, పారదర్శకత, నియంత్రణకు క్రమబద్ధమైన పరిష్కారాలు
- నైతికత & సవాళ్లు

### Agentic AI వృద్ధి లోని ప్రధాన సవాళ్లు:

- నియంత్రణ లోపించకుండా చూడటం
- నైతిక వ్యవస్థలలో చొరబడకుండా పని చేయడం
- పారదర్శకతతో పని చేసే విధంగా డిజైన్ చేయడం
- దీనిని జాగ్రత్తగా అభివృద్ధి చేయాలి, తప్పు పద్ధతిలో వాడినట్లయితే, ఇది నష్టం కలిగించగలదు.

### ముగింపు

Agentic AI మనకు ప్రత్యామ్నాయంగా కాకుండా, సహచరిగా అభివృద్ధి చెందుతోంది. మన లక్ష్యాలను మరింత వేగంగా, సమర్థంగా చేరుకోవడంలో ఇది మానవ పురోగతి భాగస్వామిగా మారుతుంది.

"ఏజెంటిక్ AI అనేది ప్రతిస్పందించే వ్యవస్థ కాదు – లక్ష్యాన్ని గుర్తించి, దాని కోసం పని చేసే స్వతంత్ర మేధస్సు."


– లత
e: ogshydcbse@gmail.com





యాత్ర

## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# బౌద్ధ వారసత్వ ప్రదేశాలు

బౌద్ధ ప్రామాణిక గ్రంథం సుత్తనిపాతలోని పారాయణవగ్గ మనకు బుద్ధుడి జీవితకాలంలోనే తెలుగు నెలకు బౌద్ధం ప్రవేశించిందని సాహిత్య ఆధారాన్నిస్తుంది. బుద్ధుడు స్వయంగా తిరుగాడిన ఉత్తరాపథం మినహా మొట్టమొదటగా బౌద్ధం అడుగిడిన నాటి అస్సక మహజనపదం లోని గోదావరి రెండుగా చీలి మళ్ళీ కలిసిన ప్రదేశాలు (ద్వీపాలు) నేటి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఉన్న బాదనకుర్తి (2600 ఎకరాల విస్తీర్ణం), బావాపూర్ కుర్రు (72 ఎకరాల విస్తీర్ణం) చారిత్రక ఆనవాళ్ళను అందిస్తున్నాయి. ఉత్తరాది నుంచి క్రీ.పూర్వం 6వ శతాబ్దం నుండి క్రీ.శ. 8వ శతాబ్దం వరకు దక్షిణాది, తూర్పు ఆసియా దేశాలకు అలానే నేడు ప్రపంచం నలుదిశలా విస్తరిస్తున్న బౌద్ధ ధమ్మ ప్రయాణానికి తెలంగాణ నేలలోని బావాపూర్, బాదనకుర్తిలు తొలి అడుగు కావడం ఇందుకు బావరి వృత్తాంతమే కార్యకారణం అయ్యిందంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి ప్రజలలోని సాంస్కృతిక, సామాజిక జీవన విధానం నేటికి బౌద్ధం పునాదుల మీదనే నడుస్తుందనటానికి వారిలోని ప్రేమ, కరుణ శాంతి, దయ మొదలైన అంశాలే నిదర్శనంగా చెప్పుకోవాలి. అవే బౌద్ధంలోని మెత్త, కరుణ, ముదిత, ఉపెక్క అనే ప్రాథమికాంశాలు. నిర్మల్ జిల్లా కేంద్రానికి 40 కి.మీ. ఖాన్‌పూర్ మండల కేంద్రానికి 6 కి.మీ. దూరంలో ఉన్న బాదనకుర్తి ద్వీపాన్ని బావరి నివసించిన స్థలంగా 1990లలో ఠాకూర్ రాజారాంసింగ్ మొదటగా గుర్తించారు. ఎక్కడైతే బావరికి పింగయ ద్వారా బోధ జరిగిందో ఆ గ్రామాన్ని బావాపూర్ కుర్ధు అంటున్నారు. బుద్ధుని మహపరి నిర్వాణ అనంతరం గోదావరి ఒడ్డున గ్రామాన్నానుకొని ఒక స్థూపాన్ని నిర్మించారని పలువురి చరిత్రకారుల రచనలు తెలిపాయి. సుమారు 25 ఏళ్ళ క్రితం ఇక్కడ దత్తాత్రేయ దేవాలయం నిర్మించినప్పుడు చాలా ఇటుకలు బయల్పడి స్థూపం ఆనవాళ్ళున్నట్లు తెలిసింది. ఆర్కియాలజీ అధికారులు అక్కడ ప్రాథమిక సర్వే చేసి ఇటుకలు చారిత్రక ఆనవాళ్ళే గాని స్థూపం ఆనవాళ్ళు అక్కడ లభించలేదని ఇంకా పూర్తి స్థాయి పరిశోధనలు చేస్తేగాని చారిత్రక ఆధారాలు లభించవచ్చని పేర్కొన్నారు.

బాదనకుర్తికి 12 కి.మీ. దిగువన బావాపూర్ దగ్గరున్న గోదావరి పాయల మధ్య ఇంకో ద్వీపంలో దొరికిన మరో ఆధారం చారిత్రక అన్వేషణను కొనసాగిస్తుంది. కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేటు అందుకొన్న స్థానిక ప్రైవేట్ కాలేజీలో చరిత్ర విభాగంలో పని చేస్తున్న డి. సంతోష్ కుమార్ తొలిసారి బావాపూర్ కుర్రు దగ్గరలోని ద్వీపంలో మట్టి దిబ్బను అక్కడ ఇటుకలు గుర్తించాడు. తరువాత ఈ ప్రదేశం చరిత్రకారుల దృష్టినాకర్షించింది. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య గారి చొరవతో చరిత్రకారుడు డా. ఎం.ఏ. శ్రీనివాసన్ ఇతర పరిశోధక విద్యార్థులు డి. సంతోష్‌కుమార్ తన సహచరుడు అశోక్ సహాయంతో అక్కడి మట్టి దిబ్బను చెట్లను తొలగించి చూస్తే చతురస్రాకారం మూడు వరుసల రాతి అమరిక మధ్య వివిధ రకాల సైజులతో ఉన్న స్థూప నిర్మాణం సుమారు 60 అడుగులు చతురస్రాకార రాతి ప్రాకారం వెలుగు చూసింది. అలాగే మరో పర్యాయం ఆర్కియాలజీ అధికారులు పి. నాగరాజ్, భానుమూర్తి గార్ల పర్యవేక్షణలో చేసిన శాస్త్రీయ పరిశోధనలో స్థూప నిర్మాణానికి దగ్గరలో ఇంకా నాలుగు చోట్ల వృత్తాకారంలో మట్టిపొరల కింద ఇటుకల నిర్మాణాలు గుర్తించారు. ఇక్కడ దొరికిన ఇటుకలు 56×26×12 సెం.మీ సైజులో ఉన్నవి. మిగతావి పలు ఆకారాలు త్రిభుజాకారం, సమాంతర చతుర్భుజం, చతుర్భుజం, అర్ధచంద్రాకారం సుమారు 8 ఆకారాలను పోలినవి దొరకడం ఇక్కడ ఇటుకల నిర్మాణాలలో జరిగిన ప్రయోగం కనిపిస్తుంది. ప్రముఖ బౌద్ధ చరిత్రకారుడు వివిధ బౌద్ధ చారిత్రక తవ్వకాల్లో అనుభవం కలిగిన దక్కన్ కళాశాల ప్రొ. శ్రీకాంత్ ఘన్‌వీర్, హరగోపాల్ మొదటగా ఇక్కడ సమాచారం తెలుసుకొని పరిశోధన చేసిన ప్రొ. జైకిషన్, జితేంద్రబాబు, తెలంగాణలోని బౌద్ధ చారిత్రక ప్రదేశాలపై పరిశోధన చేసి తొలి డాక్టరేట్ అందుకున్న ఎం.ఏ. శ్రీనివాసన్ గార్లు ఇది కచ్చితంగా తొలినాళ్ళ బౌద్ధానికి చారిత్రక ఆనవాళ్ళేనని తేల్చి చెప్పారు. డి. సంతోష్‌కుమార్ ఇచ్చిన సమాచారం తర్వాత జరిగిన అన్ని పరిశోధనల్లో నేను పాలుపంచుకోవడం నిజంగా నాకు సంతృప్తినిచ్చింది. కాని ఇక్కడ పూర్తిస్థాయి పరిశోధనలు చేసి నాటి చారిత్రక ఆధారాలను ప్రామాణికంగా, అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని బౌద్ధ చారిత్రక ప్రదేశంగా, పర్యాటకంగా అన్ని వసతులు కల్పించగలిగితే భావితరాలకు బౌద్ధం తప్పకుండా మార్గదర్శనమవుతుంది.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

సైన్స్

# నిమ్మకాయ నుంచి విద్యుత్తు


మామూలు నిమ్మకాయ నుంచి తేలికగా విద్యుత్తును తయారు చేయవచ్చు అంటే నమ్ముతారా? కాని ఇది పచ్చినిజం! దీనికి కావలసినదల్లా నిమ్మకాయ, రాగి పలక, తుత్తునాగం (Zinc) పలక. బేటరీ సెల్ తాలూకు పై భాగం తుత్తునాగంతో చేస్తారు. కాబట్టి పాత సెల్ పగలగొట్టి, లోపలి మందు తీసేసి, తుత్తునాగపు రేకు నుంచి ఒక సెంటీమీటరు వెడల్పు, రెండు సెం.మీ. పొడవుగల ముక్కను కత్తిరించి, శుభ్రంగా కడిగి తుడిచి ఉంచు. అదే సైజు రాగి పలకను కూడా కత్తిరించి శుభ్రం చేసి ఉంచు.

కొత్త నిమ్మకాయను తీసుకుని ఒక సెం.మీ. ఎడంలో చాకుతో రెండు గాట్లు పెట్టి, ఒక దాంట్లో రాగి పలకనూ, మరో దాంట్లో తుత్తునాగపు పలకనూ ఒక సెం.మీ. లోతుగా గుచ్చు. ఈ రెండు పలకలూ ఒక దానికొకటి తగలకూడదు. ఇంతే. విద్యుత్తును సృష్టించే బేటరీ తయారైంది!

ఈ విధంగా తయారయే విద్యుత్ పీడనం చాలా అల్పంగా (లో వోల్టు) ఉండటం వల్ల దాని ఉనికిని గుర్తించడానికి సున్నితమైన "ఎలక్ట్రోమీటరు" కావాలి. దీనిని కూడా మనం ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. దానికి కావలసిన వస్తువులు చిన్న దిక్సూచి, అది పట్టే చిన్న అట్టపెట్టె లేదా ప్లాస్టిక్కు పెట్టె, పది అడుగుల పొడుగున్న ఇన్సులేట్ చేసిన రాగి తీగ. దిక్సూచిని మూతలేని అట్ట పెట్టెలో పెట్టి, ఆ పెట్టె చుట్టూ రాగి తీగను 10-15 చుట్లు చుట్టు. ఇదే మన ఎలక్ట్రోమీటరు. తీగచుట్టకు సమాంతరంగా దిక్సూచి ముల్లు ఉండేటట్లు ముందుగా అమర్చుకోవాలి. ఆ తరవాత ఈ తీగల కొసలు - ఒకటి నిమ్మకాయ బేటరీ తాలూకు రాగి పలకకీ, రెండవ కొసను తుత్తునాగపు పలకకీ కలుపు. వెంటనే అయస్కాంతపు ముల్లు పక్కకి కదులుతుంది. అంటే ఆ తీగ చుట్టలో విద్యుత్తు ప్రవహిస్తోందని అర్థం.

నిమ్మకాయ బేటరీకి కలిపిన తీగలను తీసేస్తే దిక్సూచి తాలూకు అయస్కంతపు ముల్లు యథాస్థానానికి వచ్చేస్తుంది. అంటే తీగచుట్టలో విద్యుత్తు ప్రవహించడం లేదని అర్థం.

విద్యుత్తును ఈ విధంగా తయారుచేయవచ్చునని




అలిస్సాండ్రో వోల్టా (1745 - 1827) అనే ఇటాలియన్ శాస్త్రజ్ఞుడు కనిపెట్టాడు. అతడి పేరు మీదగానే విద్యుత్ పీడనానికి "వోల్ట్" అనే ప్రమాణం ఏర్పడింది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్


'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

## సామెతలు

- అవసరానికి ఆదుకున్నవాడే అయినవాడు.
- ఆవు నలుపైతే పాలు నలుపా?
- ఇల్లలుకగానే పండుగవుతుందా?
- ఊరుకున్న వాడిని ఊరేమీ చేయలేదు.
- ఋణశేషం, వ్రణశేషం, అగ్నిశేషం ఉండరాదు.
- ఎక్కడి నీరూ పల్లానికే చేరుతుంది.
- ఏట్లో పారే నీరు ఎవరు తాగితే ఏమి?
- ఒకడి పాటు, పది మంది సాపాటు.
- ఓనమాలే బుక్కులు. ఒకటి రెండే లెక్కలు.
- ఔషధం కానిది లోకంలో లేదు.

– బాలచెలిమి

లఘు నాటిక



# ఆడుకుందామా

**పాత్రలు : సత్తయ్య – తండ్రి, రంగమ్మ – తల్లి,**
**శంకర్ – కొడుకు, నరేషు –స్నేహితుడు**

రంగమ్మ : మావా నీకు ఎన్ని సార్లు చెప్పిన పిల్లగాడు ఎప్పుడు చూసినా బయటకు పోయి ఆడుడు ఇంట్ల కూడా గా ఫోన్ తీసి ఆడుతున్నడు. జర వాడి ధ్యాస మల్లించెటందుకు ఏమన్న చేయొచ్చు కద?

సత్తయ్య : మనము చదువు చెప్పేటందుకు మనకా పెద్దగా చదువురాదాయే

రంగమ్మ : రాకపోతేంది.. చదువు రాని తల్లితండ్రులు పిల్లలను సక్కంగ చదివిస్తలేరా మనం సుత మనకు తెలిసింది చేద్దాం.

సత్తయ్య : వొచ్చిందే చేద్దాం (అని చెవిలో చెబుతుంది. సరే అని తల ఊపుతాడు సత్తయ్య)

**(వారు పక్కకు వెళ్లగానే అక్కడికి శంకర్, సురేషు వస్తారు)**

* * *

శంకర్ : సురేషు ఓరి సురేషు

సురేషు : ఏందిరా శంకరు గట్ల పరేషాన్ గున్నవు?

శంకర్ : ఏం చెప్పుమంటావు రా మా ఇంట్లో పెద్ద పంచాయతీ నడుస్తుంది

సురేషు : ఏమైంది రా? పోట్లాడుకున్నారా? శంకర్ : అది పోట్లాటలో ఎందో నాకు సమజ్ అయిత లేదు నువ్వు రారా చూపిస్తా

సురేషు : ఇదెక్కడి కథ చూద్దాం పా (ఇద్దరూ వెళ్తారు)

* * *

**(రంగమ్మ, సత్తయ్య మాట్లాడుతుంటారు. పక్కన నిలబడి శంకర్, నరేషు చూస్తుంటారు. ప్రతి మాటకి వాళ్ళు హాస్య భరితంగా ఒక్కొక్కరి ముఖం వైపు చూస్తుంటారు)**

రంగమ్మ : అంగటికి పోయి నేను ఏం తెమ్మన్నా నువ్వు ఏం తెచ్చినవ్?

సత్తెయ్య : అంగట్లో అవ్వ అంటే ఎవరికి పుట్టిన బిడ్డ అన్నట్టు అరుస్తున్నావ్ ఏంది?

రంగమ్మ : అంగట్లో అన్నీ ఉన్నాయి కానీ అల్లుడి నోట్లో శని ఉన్నదట గట్లనే మాట్లాడుతున్నావ్?

సత్తయ్య : అంగట్లో ఎక్కువైతే ముంగిట్ల కు వస్తది

రంగమ్మ : అంగటికి పోయి గొంగడి తెచ్చినట్లు నేను

చెప్పిందేంది నువ్వు తెచ్చిందేంది చీర తెమ్మన్నా పంచె తెమ్మన్నా అంచు దాబే గానీ పంచె డాబులేదు!

సత్తయ్య : అవ్ అంచు లేని గిన్నె అదుపు లేని పెళ్ళాం నీ నోట్లో కేంచి ఒక్క మాట సక్కగ రాదు.

రంగమ్మ : నా మాట గురించి ఒక్క మాట అన్నా మంచిగ ఉండదు చెప్తున్న.. మాట చుట్టమే గాని పూట చుట్టం కాదు

సత్తయ్య : మంచోళ్ళకు మాటలతోనూ మొండోళ్ళకు మొట్టికాయ వేసి చెప్పాల్నట! నీ లాంటోళ్ళని చూసే అన్నారు మరి

రంగమ్మ : మాటలు కోటలు దాటుతయ్ గా మాట తెలుసా నీకు?

సత్తయ్య : అర్థం కాని మాట అల్లిబిల్లి మాట.. ఉత్త గొడ్డుకు అరుపులు ఎక్కువ

రంగమ్మ : గట్లనా ఎల్లయ్యకు ఇల్లు లేవు మల్లయ్యకు బండ్లు లేవు (కిసుక్కున నవ్వుతుంది)

సత్తయ్య : నవ్వే ఆడదాన్ని ఏడ్చే మగవాడిని నమ్మరాదు

రంగమ్మ : నవ్వుకుంట తిడితివి నరకాన పడితివి

సత్తయ్య : అందితే సిగ అందకపోతే కాళ్లు

రంగమ్మ : అయిపోయిన పెళ్ళికి మేళాలు ఎందుకు?

శంకర్ : అరే ఏంది నాయనా? అమ్మా ఏమైంది మీ ఇద్దరికీ?

రంగమ్మ : ఆవు చేలో మేస్తే దూడ గట్టులో మేస్తుందా?

సురేష్ : అంకుల్ ఆంటీ ఏమైంది మీకు?

సత్తయ్య : చుట్టమాకలి మంచానికి ఎరుక

రంగమ్మ : చుట్టం వచ్చాడంటే చెప్పులు ఎక్కడ వదిలాడో చూసి రమ్మన్నాడట!

శంకర్ : ఒరేయ్ సురేషు

సురేషు: ఏందిరా శంకరు

శంకర్ : వీళ్లు మాట్లాడుతున్నారా?

సురేషు : పోట్లాడుతున్నారా? (చెరొకరు చెరొకరిని పట్టుకొని ఆపుతారు)

శంకర్ : చెప్పండి ఏమైంది ఎందుకు ఇట్లా చేస్తున్నారు?

**(రంగమ్మ, సత్తయ్య ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు పెద్దగా నవ్వేస్తారు)**

రంగమ్మ: నేను గెలిచిన

సత్తయ్య : కాదు నేనే గెలిచిన

రంగమ్మ : కాదు నేను

సత్తయ్య: నేను నేను

శంకర్ : ఏయ్ ఆపండి అసలు సంగతి ఏంటో చెప్పండి

రంగమ్మ : ఏం లేదు బిడ్డ నాయనా నేను ఒక పందెం కట్టినం

సత్తయ్య : మీరు ఫోన్లలో ఆటలు ఆడుకుంటారు కదా

నరేషు : అవును

శంకర్ : అయితే

సత్తయ్య : మా కాడ మీ లెక్క ఫోన్లు లేవు కదా!

రంగమ్మ: మీకు మీ అమ్మ నాయన కొనిచ్చినట్లు మాకు ఎవరు కొనిచ్చెటోళ్లు ఎవరున్నరు గాని..

శంకర్ : అబ్బ అమ్మ జర సక్కంగా చెప్పు రాదే

సత్తయ్య: అదేరా వాళ్ళు గిట్ల ఫోన్లో ఆడుకుంటారు మనం గిట్ల ఆడుకోవాలంటే ఏం చేయాలి అని సోచాయించినం రంగమ్మ : పెద్ద పెద్ద చదువులు వచ్చినా రాకుండా నోటి నిండా మాకు తెలుగు సామెతలు వచ్చు

సత్తయ్య : అందుకే మాటలాట ఆడినం

రంగమ్మ : అదే సామెతలాట!

శంకర్, నరేషు : వార్నీ గిన్ని సామెతలా

రంగమ్మ : మీరైతే తెలుగు మర్చిపోబడితిరి మాకు నోటికి ఎన్ని సామెత లొచ్చో ఓ సారి మీకు ఇనిపిస్తే పుస్తకాలు చూసి మీరింకిన్ని నేర్చుకుంటరని..

శంకర్ : ఇంతకీ పందెం పేరేమిటి?

రంగమ్మ : సామెతలు నేర్వాలి మాటలు ఆడాలి

నరేషు, శంకర్ : ఈ ఆట మస్తుంది కదరా మనం గూడా మన దోస్తులకు చెప్పుదాం సామెతలు నేర్చుకుని వీళ్లకన్నా జోరుగా మాటల ఆట ఆడుదాం.

రంగమ్మ : (ప్రేక్షకులను చూస్తూ) చూసారా పిల్లలు మాటలతో మాన్యం సంపాదించొచ్చు!

సత్తయ్య: పెద్ద వారి మాట చద్దన్నం మూట!

**(శంకర్, సురేషు : మోకాళ్ల మీద నిలబడి వారికి నమస్కరిస్తారు)**

* * *

– డా. సమ్మెట విజయ
m : 99898 20215

# నిజాయితీ

ఒకానొక రాజ్యంలో ఒక రాజు గారు పరిపాలిస్తూ ఉండేవారు. ఆ రాజు గారికి అనారోగ్యం కారణంగా కొన్ని రోజులు అయ్యాక చనిపోతానని తెలిసింది. తన ప్రజలను తనలాగే మంచిగా చూసుకోటానికి ఒక మంచి రాజు కావాలని బాగా ఆలోచించి రాజ్యంలో ఉన్న యువకులు అందరినీ పిలిపిస్తాడు. వారందరికీ తలా ఒక విత్తనం ఇచ్చి ఇది మీరు ఇంటికి వెళ్ళి నాటండి. మొక్క అయ్యి కొంచెం పెరగగానే నా దగ్గరకు తీసుకురండి అన్నాడు.

కొన్ని రోజులు అయ్యాక అందరూ తమ తమ మొక్కల్ని తీసుకు వచ్చి రాజు గారికి చూపించారు. కానీ ఒక యువకుడు సోము మాత్రం "మీరు నాకు ఇచ్చిన విత్తనం మొక్క రాలేదు మహారాజా! అది విత్తనమే సరిగా లేదు కావచ్చు. అందుకే మొలవలేదు" అన్నాడు.

అప్పుడు రాజు గారు సోముని మెచ్చుకుంటూ "శభాష్! సోమూ! నువ్వు చాలా నిజాయితీ గల యువకుడివి. ఉన్నది ఉన్నట్లు చెప్పావు. నువ్వైతేనే నా రాజ్యాన్ని మంచిగా పాలించగలవన్న నమ్మకం వచ్చింది.

నేను అందరికీ ఉడికించిన విత్తనాలే వారికి తెలియకుండా నాటమని ఇచ్చాను. వారు నాకు భయపడో లేదా మరే కారణం వలననో నా దగ్గర మెప్పు పొందడం కోసం నిజాయితీ లేకుండా వేరే మొక్క తెచ్చి చూపించారు. "నువ్వు మాత్రం నిజాయితీగా నిర్భయంగా విత్తనం సరిగా లేదు" అని చెప్పగలిగావు. నా తర్వాత నువ్వే ఈ రాజ్యానికి మహారాజువు. ఎప్పుడు కూడా అబద్ధాలు ఆడకూడదు. దాపరికం ఉండకూడదు. ఉన్నది ఉన్నట్లు చెప్పాలి. అప్పుడే రాజు గారంటే గౌరవం, మర్యాద ఉంటాయి. ఇవన్నీ నీలో కనిపించాయి. కాబట్టి నా అనంతరం నీవే ఈ రాజ్యానికి రాజువు అన్నారు.

మిగతా యువకులు తాము చేసిన తప్పు తెలుసుకున్నారు. సోముకు అభినందనలు తెలియజేశారు.

– పృథ్వి
10వ తరగతి, జి.ప.ఉ.పా. పాపకొల్లు,
జూలూరుపాడు మండలం భద్రాద్రి కొత్త గూడెం జిల్లా
m : 9441815722



# ఫిజిక్స్‌లో రెండుసార్లు నోబెల్ బహుమతి పొందిన ఏకైక శాస్త్రవేత్త జాన్ బర్డీన్

అక్టోబర్ నెల అనగానే ప్రపంచవ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆసక్తిగా వేచి చూస్తుంటారు, ఎందుకంటే ఆల్ఫ్రెడ్ నోబెల్ (Alfred Nobel) జన్మదినం అక్టోబర్ 21కి ప్రతి ఏటా నోబెల్ బహుమతి గ్రహీతల పేర్లు ప్రకటించడం పూర్తి అవుతుంది. డైనమైట్ కనుక్కున్న శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ (1833-1896)వర్ధంతి అంటే డిసెంబర్ 10న ఈ గ్రహీతలందరికీ బహుమతి ప్రదానం చేయడం ఆనవాయితీ. కనుక ఈసారి నోబెల్ బహుమతులకు సంబంధించిన ఒక అంశాన్ని ముచ్చటించుకుందాం.

మేడం మేరీ క్యూరీ (Marie Curie) ఒకసారి ఫిజిక్స్ (1903)లో, మరొకసారి కెమిస్ట్రీ(1911)లో నోబెల్ బహుమతులు పంచుకున్నారు. ఇంతవరకు అలా రెండు నోబెల్ బహుమతులు పొందిన ఏకైక మహిళ మేడం క్యూరీ మాత్రమే. నిజానికి ఒకే వ్యక్తికి రెండు సార్లు నోబెల్ బహుమతులు ఇవ్వడానికి సాధారణంగా ఆ కమిటీ ఉత్సాహం చూపదు. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. వ్యక్తులకి కాకుండా సంస్థలకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చిన సందర్భాలున్నాయి. రెడ్ క్రాస్ సంస్థకు 1917, 1944, 1963 సంవత్సరాలలో నోబెల్ శాంతి బహుమతి రాగా; 1954,1981 సంవత్సరాలలో ఐక్యరాజ్యసమితికి చెందిన హై కమిషనర్ కాందిశీకుల సేవలకు సంబంధించి ఈ శాంతి బహుమతిని పొందింది.



ఇక వ్యక్తుల విషయానికొస్తే లైనస్ పౌలింగ్ (Linus Pauling) 1954లో కెమిస్ట్రీలో, 1962 శాంతి కోసం అణ్వాయుధాల విసర్జించాలని శ్రమించినందుకు అంటే మొత్తం రెండు సార్లు నోబెల్ బహుమతి పొందారు. అయితే ఒకే రంగంలో రెండుసార్లు నోబెల్ బహుమతి పొందిన గ్రహీతలు ఎవరైనా ఉన్నారా అనే ఆసక్తి కూడా కలుగుతుంది. మూడు సందర్భాల్లో రెండుసార్లు కెమిస్ట్రీ, ఒక్కసారి ఫిజిక్స్ సంబంధించి మాత్రమే ఇలాంటి అపురూపమైన చరిత్ర కనబడుతుంది. రసాయన శాస్త్రవేత్త ఫ్రెడ్రిక్ సింగర్ (Frederick Sanger) 1958లో అమినో యాసిడ్ సంబంధించిన పరిశోధనకు మొదటిసారి, 1980లో రెండవసారి డి.ఎన్.ఏ. సంబంధించి నోబెల్ బహుమతి పొందారు. అమెరికాకు చెందిన రసాయన శాస్త్రవేత్త కార్ల్ బ్యారీ షార్ప్‌లెస్ (Karl Barry Sharpless) ఒకసారి 2001లోను, మరోసారి 2022 నోబెల్ బహుమతులు పొందారు. ఇలా రెండుసార్లు నోబెల్ బహుమతి పొందిన ఐదు మంది వ్యక్తులలో మిగిలిన వారు జాన్ బర్డీన్ (John Bardeen). వీరికి మొదటిసారి 1956లో, రెండవసారి 1972లో భౌతిక శాస్త్రం సంబంధించి నోబెల్ బహుమతులు లభించాయి. ఈ ఐదు మంది శాస్త్రవేత్తలలో జాన్ బర్డీన్ చాలా ప్రత్యేకంగా కనబడతారు. ఎందుకంటే ఫిజిక్స్‌లో రెండు సార్లు నోబెల్ బహుమతులు పొందిన ఏకైక వ్యక్తి మాత్రమే కాకుండా, అలా రెండుసార్లు పొందిన శాస్త్రవేత్తలలో మొదటి వారు కూడా కావడం.

విస్కాన్సిన్‌లో 1908 మే 23న జన్మించిన జాన్ బర్డీన్, ఆ ఊరి పేరునే ఉన్న విశ్వవిద్యాలయంలో చదువు సాగింది. తన చిన్నతనంలో తల్లి మరణం కారణంగా బర్డీన్ చదువు ఆలస్యమైంది. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 1928లో బి.ఎస్., 1929లో ఎం.ఎస్. డిగ్రీలు పొందారు. సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ సంబంధించిన సమస్యతో బి.ఎస్. డిగ్రీలో సిద్ధాంత వ్యాసాన్ని ప్రఖ్యాత శాస్త్రవేత్త యూగెన్ వెగ్నర్ (Eugen Wigner) పర్యవేక్షణలో పూర్తి చేశారు. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో 1936లో మేథమేటికల్ ఫిజిక్స్‌లో పిహెచ్.డి. పూర్తి చేశారు. 1935 నుంచి 1938 దాకా హార్వర్డ్ యూనివర్సిటీలో ఫెలోగా పని చేస్తున్నప్పుడు, ఆయన ముగ్గురు శాస్త్రవేత్తలతో పని చేశారు, తర్వాతి కాలంలో ఆ ముగ్గురికి నోబెల్ బహుమతులు రావడం విశేషం.

1945 నుంచి బెల్ లేబరేటరీలో విలియం షాక్లే (William Shocley) బృందం చేస్తున్న సాల్ట్ స్టేట్ పరిశోధనలలో అంతర్భాగమయ్యారు. విద్యుత్ క్షేత్రాన్ని వినియోగించి సెమీ కండక్టర్ వాహకత్వాన్ని మార్చగల ఆలోచనతో ఈ ఏడెనిమిది మంది శ్రమిస్తున్నారు కానీ ఫలితాలు రావడం లేదు. ఆ సమయంలో విద్యుత్ క్షేత్ర ప్రవేశాన్ని అటకాయిస్తున్న సెమీ కండక్టర్ల తలాల గురించి ఆలోచన చేయడం అవసరమన్నారు. దానితో ఆ బృందం పరిశోధనాదృష్టి ఇటువైపు మళ్ళింది. త్వరత్వరగానే ఫలితాలు వచ్చాయి. మొదట 1946 చివరన జాన్ బర్డీన్ ఒక పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అదే బృందంలోని వాల్టర్ బ్రట్టైన్ (Walter Brattain) సెమీ కండక్టర్ల పై కాంతిని ప్రశ్నింపచేస్తూ వాటి స్వభావాన్ని అధ్యయనం చేశారు. ఇదే ట్రాన్సిస్టర్ ఆవిష్కరణకు మూలమైంది. అంతవరకు వ్యాక్యూమ్ ట్యూబ్స్ వాడేవారు. వాటి పరమాణంలో 50వ వంతు చిన్నదైనా ట్రాన్సిస్టర్ స్వల్పకాలంలోనే ప్రాచుర్యం పొందింది. కనుక జాన్ బర్డిన్ 1956లో వాల్టర్ బ్రట్టైన్, విలియం షాక్లేతో కలిసి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు.

ట్రాన్సిస్టర్ ఆవిష్కరణ మొదటి నోబెల్ బహుమతిని సాధించిపెడితే; సూపర్ కండక్టివిటీ సంబంధించిన పరిశోధన 1972లో రెండవ నోబెల్ బహుమతిని ఆర్జించి పెట్టింది. బెల్ లేబరేటరీస్ ఉద్యోగాన్ని వదిలివేసి 1951లో జాన్ బర్డీన్ యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయస్‌లో ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్ బోధించేందుకు చేరారు. 1957లో లియాన్ కూపర్ (Leon Cooper), తన పరిశోధక విద్యార్థి జాన్ రాబర్ట్ స్క్రిఫ్ఫర్ (John Robert Schrieffer)తో కలిసి అతివాహకత్వం లేదా సూపర్ కండక్టివిటీ సంబంధించి బి.సి.ఎస్. థియరీని ప్రతిపాదించారు. ఇక్కడ బి.సి.ఎస్. అంటే బర్డీన్, కూపర్, స్క్రిఫ్ఫర్ శాస్త్రవేత్తల పేర్లలోని మొదటి అక్షరాలే.

జాన్ బర్డీన్ సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. అతని పరిశోధక మిత్రులకు తెలియని హాబీ ఏమిటంటే ఆయనింటి చుట్టుపక్కలున్న వారికి మంచి మంచి వంటలు చేసి పెట్టడమని. గోల్ఫ్ ఆట ఆడటం, కుటుంబంతో పిక్నిక్ వెళ్లడం కూడా ఆయనకు చాలా ఇష్టం. 1956లో నోబెల్ బహుమతి ప్రధానం జరిగినప్పుడు జాన్ బర్డీన్ తన ముగ్గురి సంతానంలో ఒక కుమారుని మాత్రమే తీసుకువెళ్లారు. ఆ సమయంలో కొందరు మిత్రులు ఆటపట్టిస్తే మళ్లీ రెండవసారి అందరినీ తీసుకొస్తానని చమత్కారం చేశారు. అలాగే రెండోసారి బహుమతి లభించినప్పుడు ఆ మాటను ఈ శాస్త్రవేత్త నిలబెట్టుకున్నారు.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392





# సీతాఫల చెట్టు


మనం బతుకమ్మ, దసరా పండుగ మస్తు చేసుకున్నం కదా! బాలలూ! ఇప్పుడు చిచ్చుబుడ్లు, రాకెట్లు, భూ చక్రాలు, తోక బాంబులు వంటి పటాసులు కాల్చే దీపావళి పండుగ కూడా ఎంజాయ్ చేద్దాం. దీపావళి పండుగ వస్తుందంటే చాలు, సీతాఫల పండ్లు మార్కెట్లో బాగా కనిపిస్తాయి. ఈ నవంబర్ నెల బాలచెలిమి సంచికలో "సీతాఫల చెట్టు" విశేషాల గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

సీతాఫల చెట్టు అన్నో నేసి కుటుంబానికి చెందిన చిన్న వృక్షం. ఈ చెట్టు కమ్మని, తీపి, రుచికరమైన పోషకాలతో కూడిన పండ్లను ఇస్తుంది. ఈ పండ్లను ఆంగ్లంలో 'కస్టర్డ్ ఆపిల్' అంటారు. సీతాదేవి తన భర్త రాముడితో కలిసి 14 సంవత్సరాల వనవాసం సమయంలో ఈ పండ్లను తిన్నట్లు చరిత్ర చెబుతుంది. అందుకే "సీతాఫలం" అనే పేరు వచ్చినట్లు తెలుస్తుంది. సంస్కృతంలో 'శీత్' అంటే చల్లని, 'ఫల్' అంటే పండు అనే అర్థం. ఈ పండ్లు అంటే ఇష్టపడని వారు ఎవరు ఉండరు. దసరా పండుగ నుండి సంక్రాంతి పండుగ వరకు శీతాకాలంలో ఈ పండ్లు మార్కెట్లో బాగా వస్తాయి. ఈ సీతాఫల చెట్ల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పండ్లు తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా గుండె ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. జీర్ణ క్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల ఆరోగ్యానికి మరియు ఎముకల బలానికి ఎంతగానో దోహద పడతాయి. ఈ పండ్లలో మెత్తటి గుజ్జు, నల్లటి గింజలు కూడా ఉంటాయి. ఈ చెట్టు పండ్లు అమృతం లాంటివి. కడుపులో మంట కూడా తగ్గుతుంది. ఈ సీతాఫలం చెట్టు ఉష్ణ మండలం ప్రాంతాలలో బాగా పెరుగుతాయి. ఈ చెట్లను పెంచడానికి పెద్దగా నీరు అవసరం ఉండదు. గట్ల పొంటి, చిన్న చిన్న గుట్టల మీద, డొంకల పొంటి, కాలువల ప్రక్కన, బంజరు భూములలో సీతాఫల చెట్లు బాగా కనిపిస్తాయి. ఇటీవల కాలంలో రైతులు హైబ్రిడ్ సీతాఫలం మొక్కలు నాటి తోటలు పెంచుతున్నారు. ఈ చెట్లు చిన్నచిన్న కొమ్ములతో 3 మీటర్ల నుండి 8 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. ఈ చెట్ల యొక్క ఆకులను ఆయుర్వేదంలో కూడా వాడుతారు. తేలు, పాము వంటి విషపురుగులు కరిచినప్పుడు కూడా సీతాఫలం గింజలతో రుద్ధి గంధం తీసి కరిచినచోట పెడతారు. ఈ ఆకులలో విటమిన్ ఎ, సి, పీచు, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకుల వల్ల చర్మం నాజూకుగా ఉండడమే కాకుండా మొటిమలను కూడా నివారించవచ్చు. ఈ చెట్టు ఆకులు, బెరడు, గింజలు చాలా ఉపయోగపడతాయి. పలు వ్యాధుల నివారణకు ఉపయోగిస్తారు. సీతాఫల పండ్లు తినడం వల్ల కాల్షియం పెరుగుతుంది. మెదడుకు శక్తి వస్తుంది. ఈ పండ్ల గింజలను చూర్ణం చేసి పెట్టుకుంటే తలలో చుండ్రు కూడా పోతుంది. ఈ పండ్ల గుజ్జును తేనెలో కలిపి తింటే బరువు కొంత మేరకు పెరగవచ్చు.

చదివారు కదా బాలలూ! ఈ చెట్ల పండ్లను వయసుతో సంబంధం లేకుండా అందరం ఇష్టంగా తింటాం కదా! ఇంకా మరెందుకు ఆలస్యం సీతాఫల మొక్కలను కనిపించిన ఖాళీ ప్రదేశాల్లో నాటుదాం. పర్యావరణ సమతుల్యత పెంచుదాం. ఆరోగ్యంగా ఉందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


బాలల పండుగ
రచన: జుగాష్‌విలి
బొమ్మలు:
గోపి : ఇవాళ చాచా నెహ్రూ పుట్టిన రోజు. మా పిల్లల పండుగ. స్కూలంతా ఒకటే సందడి.
తాతయ్య : వెరీగుడ్. బాలల హక్కుల పరిరక్షణ ఈ పండుగ లక్ష్యం. తెలుసా నీకు?
గోపి : పిల్లలకి హక్కులా? అవి ఏమిటి తాతయ్యా?
తాతయ్య : చదువుకునే హక్కు, భావాలను, సమాచారాన్ని ఇతరులతో పంచుకునే హక్కు, ఆరోగ్యంగా ఉండే హక్కు, విలువలున్న విద్యా హక్కు.
గోపి : అమ్మా నాన్న బడికి పంపుతారు. మేం చదువుకుంటాం. స్నేహితులతో ఆడుకుంటాం. మాట్లాడుకుంటాం. అంతేగా.
తాతయ్య : మరి అందరు పిల్లలూ బడికి పోతున్నారా? ఎందుకు పోవడం లేదు తెలుసా?
గోపి : చెప్పు తాతయ్యా.
తాతయ్య : తల్లి దండ్రులకి పిల్లల్ని చదివించే ఆర్థిక స్థోమత లేదు. పిల్లల్నీ ఏదో ఒక పనికి పంపుతున్నారు. అమ్మానాన్నలు పనికిపోతే చిన్న పిల్లల్ని చూసుకోవడానికి ఆడపిల్లల్ని ఇంట్లోనే ఉంచుతున్నారు.
గోపి : మ్.
తాతయ్య : పేదరికంతో సరైన తిండి లేక, సరైన వసతులు లేని కాలుష్య పరిసరాల్లో ఉంటూ పిల్లలు రోగాల పాలవుతున్నారు.


గోపి : అయ్యో!
తాతయ్య : బడికి వెళ్లలేకపోవడం, అనారోగ్యం పాలు కావడం, విలువలతో కూడిన విద్య లేకపోవడం, తోటిపిల్లలతో సమానంగా ఉండలేకపోవడం, అందరితో సంతోషంగా ఆడుకోలేక పోవడం పిల్లల హక్కులకు భంగం కాదా?
గోపి : అవును మరేం చేయాలి తాతయ్య.
తాతయ్య : పిల్లల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలి. వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.
గోపి : అదెలా సాధ్యం తాతయ్య!
తాతయ్య : ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలి. బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి. అమ్మానాన్నల ఆర్థిక స్థోమతను పెంచాలి. పిల్లలకు ఆరోగ్యకరమైన, పోషకాహారాన్ని ఉచితంగా అందించాలి.
గోపి : ఇంకా...
తాతయ్య : పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదిగేలా వైద్య సదుపాయాలూ, గ్రంథాలయాలు, ఆట స్థలాలూ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
గోపి : అవును తాతయ్యా. అందరూ చదువుకుంటూ, కలిసి మెలిసి ఆడుకుంటూ, స్నేహంగా వుంటే ఎంత బావుంటుందో.
తాతయ్య : అవునురా! అప్పుడే నిజమైన బాలల పండుగ.



# ఒలంపిక్స్ లక్ష్యంగా దూసుకెళ్తున్న తన్వీ శర్మ

భారత యువ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తన్వీ శర్మ, ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించేందుకు దూసుకుపోతుంది. 2008 డిసెంబర్ 22న పంజాబ్‌లో జన్మించిన ఆమె, 2025 BWF వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్‌లో రజత పతకం సాధించి దేశానికే గర్వకారణంగా మారింది. మహిళల సింగిల్స్‌లో రజతం గెలిచిన తన్వీ, 17 సంవత్సరాల తర్వాత ఈ విభాగంలో పతకం సాధించిన తొలి భారతీయ యువతిగా నిలిచింది.

తరువాత US Open 2025 (Super 300) టోర్నీలో ఫైనల్‌కు చేరిన తన్వీ, రన్నర్-అప్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆమె ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. ప్రైవేట్ శిక్షణ సంస్థల మద్దతుతో ఆమె ప్రస్తుతం ఒలింపిక్స్ లక్ష్యంగా కృషి చేస్తుంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆమెకు విశేషమైన అభిమానులు పెరుగుతున్నారు. భారత బ్యాడ్మింటన్‌గా భవిష్యత్తులో తన్వీ శర్మ కీలక పాత్ర పోషించనుంది.

– బాలచెలిమి డెస్క్



# మీ వెహికిల్ నెంబర్



1. ప్రేక్షకులను వారి వెహికిల్ నెంబర్‌ను 5తో గుణించమనండి.
2. ఆ వచ్చిన జవాబుకు 6ను కలపమనండి.
3. ఆ వచ్చిన జవాబును 4తో గుణించమనండి.
4. ఆ వచ్చిన జవాబుకు 9 కలపమనండి.
5. ఆ వచ్చిన జవాబును 5తో గుణించమనండి.
6. ఆ జవాబును మీకు చెపితే వారి వెహికిల్ నెంబర్ చెప్పాలి.

| ఉదా : | ఉదా: |
|---|---|
| 1965×5=9825 | 9977×5=49885 |
| 9825+6=9831 | 49885+6=49891 |
| 9831×4=39324 | 49891×4=199564 |
| 39354+9=39333 | 199564+9=199573 |
| 39333×5=196665 | 199573×5=997865 |

196665 అని చెప్పగానే 1965 అని, 997865 అని చెప్పగానే 9977 అని చెప్పాలి.

రహస్యం : చివరగా చెప్పిన సంఖ్య నుండి 165ను తీసివేయాలి.

196665–165=1965~~00~~

997865–165=9977~~00~~

చివరగా వచ్చిన రెండు సున్నాలను కొట్టివేయాలి.

## BEAUTY NUMBER

143 x Seven multiplies

143 x 7 = 1001

143 x 14 = 2002

143 x 21 = 3003

143 x 28 = 4004

143 x 35 = 5005

143 x 42 = 6006

143 x 49 = 7007

143 x 56 = 8008


143 x 63 = 9009

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937

కథ

# మంచి మార్పు



అనగనగ ఒక ఊరిలో ఒక ధనవంతుడు ఉండే వాడు. అతని పేరు రవి. రవి బాగా చదువుకున్న వ్యక్తి, మంచిగా సంపాదించాడు. చాలా ఆస్తిని, పొలాన్ని, ఇల్లును సంపాదించాడు అతని భార్య పేరు రమ. వీరికి ఒక కూతురు. ఈ అమ్మాయి చాలా మంచిది బాగా చదువుతుంది. రవి ధనవంతుడు అవ్వడంతో ఇతనికి చాలా మంది స్నేహితులు ఉన్నారు. రవికి ఎలాంటి చెడ్డ అలవాట్లు లేవు కానీ ఒకరోజు రవి వాళ్ళ స్నేహితులు రవిని ఒక పార్టీకి పిలిచారు ఆ పార్టీలో అందరు తాగుబోతులే. రవిని తాగమని అతని స్నేహితులు బలవంతం చేశారు. ఎంత తాగను అని చెప్పిన స్నేహితులు వినలేదు. కొంచెం తాగితే ఏం అవుతుందిలే అని రవి కొంచం తాగుతా అని ఒక సిప్ తాగాడు. అది అతనికి నచ్చింది అంతే ఒక బాటిల్ మొత్తం తాగాడు. పార్టీ అయిపోయింది. ఇంటికి వెళ్ళాడు రవి. అతని భార్య రవిని చూసి చాలా బాధపడింది. ఎందుకు తాగారు అని నిలదీసింది. నీకు ఎందుకు? నేను తాగుతా అని తనని కొట్టాడు. ఎప్పుడు లేనిది ఈరోజు తాగి, నన్ను కొట్టాడు ఏంటి అని రవి భార్య రమ చాలా బాధపడి ఏడ్చింది. రోజూ ఇలానే ఏదొక పార్టీకి వెళ్ళి రోజు తాగివచ్చి రమని కొడుతున్నాడు. రమ చాలా బాధపడుతుంది. తాగడం పెరిగింది రోజంతా తాగడం మొదలు పెట్టాడు. తాగుతూ తాగుతూ అప్పుల పాలు అయ్యాడు. ఉన్న డబ్బు అంత అయిపోయింది. ఆస్తిని, పొలాన్ని, ఇల్లును అంతా అమ్మాడు. తన భార్య ఒంటిమీద ఉన్న నగలతో సహా అన్నింటిని అమ్మేసాడు. పాపం రమ, తన కూతురు ఇద్దరూ చాలా బాధపడుతున్నారు. తాగి, తాగి, రవి లివర్ పాడైయింది. రమకి ఏం చేయాలో అర్థంకాక రవిని బాగా తిట్టి, అప్పులు తెచ్చి రవికి ఆపరేషన్ చేయించింది. కొన్నిరోజులు వేరేవాళ్ళ ఇళ్లల్లో పని చేసి రమ రవిని, పాపని చూసుకుంది. రవికి బుద్ధి వచ్చింది. బాగా చదువుకున్నావాడైనా తాగుడుకి బానిసై, ఉన్న ఆస్తిని, పేరును పోగొట్టుకున్నాడు రవి. స్నేహితుల మాటవిని ఈ స్థితికి వచ్చాడు రవి. కాబట్టి ఎవరైన సరే చెడు వ్యసనాలను గురించి కాని చెడు పనుల గురించి కాని చెయ్యి మని చెప్తే మనం వారి మాటలు వినకూడదు. దానికి లొంగకూడదు. రవి మారాడు, తాగడం మానేశాడు. భార్యకు సహాయం చేస్తున్నాడు. చదువుకున్న వాడు కావడంతో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ, అప్పులు తీర్చి, భార్య, పాపని మంచిగా చూసుకున్నాడు. జీవితంలో మళ్ళీ మందు జోలికే వెళ్ళలేదు.

– శ్రీ చరిత
10వ తరగతి, ZPHS మూడపల్లి
m : 8498912913

# తెలివితక్కువ నక్క గొర్రెపోతుల పోరాటం





ఒక అడవిలో గొర్రెలు చాలా ఉన్నాయి. ఒక రోజు రెండు గొర్రెపోతుల మధ్య పోట్లాట మొదలైంది. అవి తలలతో ఒకదానినొకటి ఢీకొంటూ భయంకరంగా పోరాడసాగాయి. అవి వెనక్కి వెళ్లి చాలా వేగంతో ముందుకు వచ్చి ఢీకొనసాగాయి.

ఈ పోరాటాన్ని ఒక నక్క చూసింది. గొర్రెలలో ఒకటి తప్పకుండా మరణిస్తుందని, దానిని తినవచ్చు అనే ఆశ నక్కకి కలిగింది. గొర్రెపోతులు ఢీ కొన్నప్పుడు వాటి తలల లోంచి రక్తం కారసాగింది. కొంత సేపటికి అవి ఢీకొట్టే చోట, నేల రక్తంతో తడిసిపోయింది. నక్కకి ఆ రక్తాన్ని చూడగానే నోరు ఊరి, మతిపోయింది. గొర్రెపోతులు మరొకసారి కుమ్ము కోవడానికి వెనక్కి నడిచినప్పుడు ఆ నక్క ఉండబట్టలేక ఆ రక్తాన్ని నాకుదామని ముందుకు దూకింది. ఆ నక్క నేలపై ఉన్న రక్తాన్ని మైమరచి నాకుతుండగా, మళ్ళీ గొర్రెపోతులు రెండూ వచ్చి బలంగా ఢీ కొట్టుకున్నాయి. వాటి మధ్యలో నలిగి నక్క మరణించింది.

**నీతి : అత్యాశ పనికి రాదు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో లేదో చూడకుండా దేనికీ తొందరపడకూడదు.**

సేకరణ : అమరావతి



## పుట్టినరోజు కానుకగా ప్రకృతికి ఓ మొక్క

చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని బొబ్బల నవ్య, తన పుట్టినరోజు సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను నాటి అందరికీ స్ఫూర్తి కలిగించింది.

కథ

# శీతాకాలపు కథ

## రేవాజ్ ఇవానిష్‌విలి



అనగనగా ఓ అడవి సమీపాన ఉన్న ఒక ఊరిలో ముసలి దంపతులు నివసిస్తూ వుండేవారు. వారి కొడుకు పట్టణంలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆ దంపతులకి ఇద్దరు మనుమలు ఉండేవారు.

వారి ఉద్యానవణంలో రకరకాల పూలచెట్లు, పండ్ల చెట్లు ఉండేవి. వాళ్ళు బోల్డన్ని కోళ్ళని పెంచేవారు. ప్రతి రోజూ ఉదయం కోళ్ళకి గింజలు వేయడం, తోటపని చేసుకోవటం చేసేవారు. రాత్రుళ్ళు కోళ్ళను గంపల కిందపెట్టి భద్రంగా కాపాడేవారు.

అది వేసవి కాలం.

ఓ రోజు పోస్ట్‌మెన్ కార్డుముక్క తెచ్చిచ్చాడు. అందులో విషయమేమిటంటే, తన కొడుకు కుటుంబం, మనవలతో కలిసి, త్వరలో ఆ ఊరు వస్తున్నారని, మనవలు ప్రతి వేసవి సెలవుల్లో జేజయ్య, జేజమ్మ వద్ద ఆడుకుంటూ, కథలు వింటూ హాయిగా గడిపేవారు.

ప్రతిరోజు ముసలయ్య రైల్వేస్టేషన్‌కు వెళ్ళి ఎదురు చూసేవాడు. రెండు రోజుల తర్వాత కొడుకు, కోడలు, మనుమలు వచ్చారు. ఎంతో సంతోషించారు ముసలి దంపతులు.

రాత్రి అన్నం తిన్న తరువాత కథలు చెప్పమని అడిగేవారు పిల్లలు. బోల్డన్ని రాజుల కథలు, మాయ మంత్రాల కథలు, జానపద కథలు చెప్పేవాడు తాతయ్య. ఏదయినా నిజంగా జరిగిన కథ చెప్పమని అడిగారు పిల్లలు.

కథ చెప్పడం మొదలుపెట్టాడు తాతయ్య.

అది పోయిన సంవత్సరం శీతాకాలం.

ఊరంతా మంచు దుప్పటి కప్పుకుని వుంది.

ఓ రోజు హఠాత్తుగా ఓ కోడి మాయమైంది. ఎంత వెతికినా దొరకలేదు. తరువాత రోజు మరో కోడి మాయమైంది. ఇలా చాలా కోళ్ళు మాయమయ్యాయి. తీరా చూస్తే కోళ్ళ గది వెనుక క్రింద భాగంలో ఓ గుంత కనిపించింది.

అది ఓ గుంటనక్క పనే అని అర్థమయ్యింది. దానికి గుణపాఠం చెప్పాలనుకున్నాడు తాత. ఇరుగు పొరుగు వారికి గుంటనక్క సంగతి, తమ కోళ్ళను కాజేసిన సంగతి చెప్పాడు తాత. వాళ్ళు రకరకాల సలహాలు ఇచ్చారు.

వాటిలో మొదటి సలహా, 'తుపాకితో నక్కను వేటాడటం.' కానీ, తాత ముసలివాడు, రాత్రంతా తుపాకి పట్టుకుని గురి చూస్తూ కూర్చోటం సాధ్యం కాదు. ఈ సలహా వల్ల ప్రయోజనం లేదు.

రెండు సలహా, 'ఓ మేలుజాతి కుక్కను పెంచు కోవటం.' కానీ అది బుజ్జి కోడి పిల్లల్ని తినదన్న భరోసా ఏమీ లేదు. కాబట్టి ఈ సలహా కూడా తాతకి నచ్చలేదు.

ఇక మూడవ సలహా, 'నక్కను బంధించటానికి ఓ మూడు ఉచ్చులను ఏర్పాటు చెయ్యటం' ఈ సలహా బాగా

నచ్చింది తాతకు.

నక్కను బంధించటానికి ఇరుగుపొరుగు వారి సాయంతో మూడు ఉచ్చులను ఏర్పాటు చేశారు. మొదటి ఉచ్చును కోళ్ళగూడు వెనకాల వున్న గుంత వద్ద ఏర్పాటు చేశాడు. రెండవ ఉచ్చును ఇంటి చుట్టూ ఉన్న, తెగిన ముళ్ళ కంచె వద్ద ఏర్పాటు చేశాడు. ఇక మూడవది ఇంటి నుండి అడవికి ప్రవేశించే దారి వద్ద ఏర్పాటు చేశాడు. మూడు ఉచ్చులు కనపడకుండా మంచుతో కప్పాడు.

రాత్రి చాలా సేపు మేలుకొని వున్నాడు తాత. గుంట నక్కను బంధించాలని, గట్టి పట్టుదలతో వున్నాడు. అర్ధరాత్రి తర్వాత, గట్టి కర్రనొకదాన్ని పట్టుకుని, ఉచ్చులను పరిశీలించడానికి బయలుదేరాడు.

మొదటి ఉచ్చు చూశాడు. ఖాళీగా ఉంది. రెండవ ఉచ్చు చూశాడు. అదీ ఖాళీగా ఉంది. ఇక మూడవ ఉచ్చు వద్దకు వెళ్ళాడు. గుంటనక్క ఆ ఉచ్చులో చిక్కుకుని ఉంది. మొదట ఇరుగు పొరుగు వాళ్ళని పిలుద్దామని అనుకున్నాడు తాత. కానీ వెంటనే తన మనసు మార్చుకున్నాడు.

"ఎలా ఉన్నావు?" అడిగాడు తాత.

జవాబివ్వలేదు నక్క.

"ఎందుకు నిశ్శబ్దంగా వున్నావు. నాతో మాట్లాడు. నీకు సిగ్గుగా లేదా? మా కోళ్ళను ఏం చేశావు?" గట్టిగా అడిగాడు తాత.

కానీ నక్క తాత కళ్ళలోకి సూటిగా చూడలేక తలదించుకుంది. తన దగ్గరున్న దుడ్డుకర్రతో నక్క తల మీద కొడదామనుకున్నాడు.

కాని తాత దయార్ద్ర హృదయుడు. హఠాత్తుగా ఏం చెయ్యాలో తాతకు అర్థమైంది. తన చలికోటుని విప్పి, నక్కకు కప్పాడు. ఉచ్చులో నుంచి దాన్ని జాగ్రత్తగా విడిపించాడు. అది కృతజ్ఞతగా తాత కళ్ళలోకి చూసింది. దాని కళ్ళ నుండి రెండు కన్నీటి బొట్లు రాలాయి. మెల్లగా అడవిదారి పట్టింది నక్క.

"ఇది పిల్లలు, నా శీతాకాలపు కథ" అన్నాడు తాత.

మనవళ్ళు తాతపై ముద్దుల వర్షం కురిపించాడు.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 81792 73971
ఇంగ్లిష్ : ఎ. వింటర్ టేల్
రచయిత : రెవాజ్ ఇవానిష్‌విలి
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

**శతకం**


# వేమన పద్యాలు

**గంగపారునెపుడు గదలని గతి తోడ**
**మురికివాగు పారు మ్రోత తోడ**
**పెద్ద పిన్నతనము పేర్మి యీలాగురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : మంచి నీటి ప్రవాహము నిశ్శబ్దముగా వుండును. మురికినీటి కాలువ గల గలా పెద్ద శబ్దంతో పారుచుండును. మంచి వారికి, చెడ్డ వారికి తేడా యిలాగే వుండును.

**నేరనన్నవాఁడు నెరజాణ మహిలోన**
**నేర్తునన్నవాఁడు నిందజెందు**
**ఊరకున్నవాఁడె యుత్తమ యోగిరా!**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : తనకు తెలియని దానిని తెలియదని అంగీకరించువాడు తెలివైనవాడు. సకలము నాకే తెలుసునని వాడు చివరకు నిందల పాలవును. మౌనముగా ఉన్నవాడు గొప్ప యోగి లేదా గొప్ప బుద్ధిమంతుడు.



# తోక లేని నక్క



ఒక అడవిలో ఒక జిత్తులమారి నక్క నివసిస్తున్నది. ఒక రోజు ఆహారం కోసం నదీ తీరం వెంబడి నడవసాగింది. దారి వెంట దానికి ఎన్నో పీతలు/ఎండ్రకాయలు దర్శన మిచ్చాయి. దగ్గరకు వెళ్ళే కొలది పీతలు కలుగుల్లోకి దూరి పోతున్నాయి. నక్క చాల సేపు వాటి కోసం ప్రయత్నించింది. ఒక్క పీత కూడ పట్టుబడలేదు. నిరాశ పడింది నక్క. ఇంతలో దానికి ఒక ఉపాయం తట్టింది.

వెంటనే దాని తోకను పీతల కలుగులోకి చొప్పించింది. ఒక పీత ఏదో కలుగులోకి చొరబడిందనుకొని, దాని కొండ్లతో గట్టిగ అదిమి పట్టింది. తోకకు కొంచెం నొప్పి అనిపించగానే నక్క ఒక్క ఉదుటున బయటకు లాగింది. తోకతో పాటు పీత బయటకి వచ్చి పడింది. దానిని కాలుతో అదిమి పట్టి తినడం మొదలు పెట్టింది. ఇలా ప్రతి రోజు, ఇదే పద్ధతి ద్వారా, పీతలను వేటాడి కడుపు నింపుకుంటున్నది.

కాలం గడుస్తున్నది. పీతలలో ఆందోళన మొదలైంది. ఒక ముసలి పీత, "మన సంఖ్య రోజురోజుకు తగ్గిపోతున్నది. నక్క పీడ ఎలాగైనా వదిలించుకోవాలి, లేదంటే మన ఉనికికే ప్రమాదం ఏర్పడవచ్చు" అని తోటి పీతలతో అంది. అవి చాలా విధాలుగా అలోచించాయి. వాటికి ఒక మెరుపైన ఆలోచన వచ్చింది.

ముసలి పీత బలమైన మరియు పదునైన కొండ్లు కలిగిన కొన్ని పీతలను ఎంపిక చేసింది. వాటికి ఎం చేయాలో చెప్పింది. అవి నక్క కోసం వేచి చూడసాగాయి.

ఒక రోజు నక్క ఎప్పటిలాగే ఆహారం కోసం బయలు దేరింది. నక్కను చూసిన పీతలు కలుగుల్లోకి దూరాయి. తన తోకను ఆ కలుగులోకి జొనిపించింది నక్క. అనుకున్న విధంగా, పీతలు తమ బలమైన మరియు పదునైన కొండ్లతో తోకను గట్టిగా కరిచాయి. నక్క తేరుకుని, ఒక్కసారిగా తోకను బయటకు లాగింది. పీతలు రాలేదు. సరికదా తోక సైతం తెగిపోయింది.

తోక తెగిన బాధతో నక్క విలవిలలాడింది. నొప్పి భరించలేక అక్కడి నుండి పరుగు పెట్టింది. మధ్యమధ్యలో మొండి తోకను చూసుకుంటూ మరింత దు:ఖ పడసాగింది.

పీతలు నక్క పీడ విరగడైందని సంబరాలు చేసుకున్నాయి.

– కె. శ్రీలత రావు
ప్రభుత్వ ఉపాధ్యాయులు, కరీంనగర్
m : 9491480386





# డిజిటల్ రూపాయి
## భారత ఆర్థిక వ్యవస్థలో నూతన దిశ

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) ప్రవేశపెట్టిన "డిజిటల్ రూపాయి (e₹)" దేశ ఆర్థిక వ్యవస్థను డిజిటల్ మార్గంలో ముందుకు నడిపించే ప్రధాన ఆవిష్కరణగా నిలుస్తోంది. ఇది సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (CBDC)గా పిలవ బడుతుంది, అంటే RBI ఆధ్వర్యంలో జారీచేయబడే చట్టబద్ధ డిజిటల్ కరెన్సీ. భౌతిక నోట్లకు దీన్ని సమానంగా ఉపయోగించవచ్చు, అయితే ఇది పూర్తిగా డిజిటల్ రూపంలో లభిస్తుంది. డిజిటల్ రూపాయిని రెండు రూపాల్లో ప్రవేశ పెట్టారు. హోల్‌సేల్ (e₹-W) మరియు రిటైల్ (e₹-R). హోల్‌సేల్ రూపం బ్యాంకుల మధ్య పెద్ద లావాదేవీలకు ఉపయోగ పడుతుంది, రిటైల్ రూపం సామాన్య ప్రజలు, వ్యాపారులు రోజువారీ లావాదేవీల్లో వాడటానికి అనుకూలంగా ఉంటుంది. ఇది "బ్లాక్‌చెయిన్" సాంకేతికత ఆధారంగా ఉంటుంది. కాబట్టి లావాదేవీలు సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించ బడతాయి. RBI ఈ-రూపీని 2022లో పరీక్షాత్మకంగా ప్రారంభించి, 2023 నాటికి 50 వేల వినియోగదారులు, 5 వేల వ్యాపారులకు విస్తరించింది. తాజాగా 2025లో ఆఫ్‌లైన్ చెల్లింపు వ్యవస్థను కూడా ప్రారంభించింది, దీంట్లో "**ఇంటర్నెట్ లేకపోయినా చెల్లింపులు చేయవచ్చు**". ఈ వ్యవస్థ QR కోడ్, ట్యాప్ వంటి సాంకేతికతలతో పని చేస్తుంది. ఇది గ్రామీణ ప్రాంతాలలో డిజిటల్ చెల్లింపులను విస్తరించడంలో కీలక పాత్ర పోషించనుంది. డిజిటల్ రూపాయి ఉపయోగించాలంటే RBI ఎంపిక చేసిన బ్యాంకుల యాప్ ద్వారా వాలెట్ సృష్టించాలి. ఆ వాలెట్‌లో రూపాయలు లోడ్ చేసి, వ్యక్తులు లేదా వ్యాపారులకు QR స్కాన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లో పని చేస్తుంది. వినియోగదారుల సమాచారం భద్రత, లావాదేవీల వేగం, మరియు ఖర్చు తగ్గింపు డిజిటల్ రూపాయి ముఖ్య ప్రయోజనాలు. డిజిటల్ రూపాయి కారణంగా ప్రభుత్వానికి కరెన్సీ ముద్రణ, రవాణా, భద్రత వంటి నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. దీని వలన పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. యూపీఐ వంటి ఆన్‌లైన్ చెల్లింపులకన్నా డిజిటల్ రూపాయిలో లావాదేవీలు తక్కువ సమయంలో, ఇంతర్ మీడియట్ ప్రక్రియలు లేకుండా సాగుతాయి.

భవిష్యత్తులో డిజిటల్ రూపాయి మన దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా రూపాంతరం చెందించే శక్తిగా మారవచ్చు. ఇది కేవలం ఒక చెల్లింపు సౌకర్యం కాదుబీ డిజిటల్ భారత దిశలో "టెక్నాలజీ ఆధారిత ఆర్థిక విప్లవానికి పునాది". RBI ఈ ప్రయత్నం ద్వారా కరెన్సీ స్థాయిలో ఆవిష్కరణను మాత్రమే కాకుండా, సామాన్య ప్రజలకు సులభమైన, సురక్షితమైన ఆర్థిక వ్యవస్థను అందిస్తోంది.

– బాలచెలిమి డెస్క్





# రెండు వేల సంవత్సరాల నాటి సామాజిక పరిస్థితులు

శాతవాహన కాలం కంటే ముందు గల యుగ సంస్కృతికి సరైన ఆధారాలు లేక అది మనకు పెద్దగా తెలియరాలేదు. ఇక శాతవాహనుల కాలం వరకు తెలుగు ప్రజలు ఉత్తర భారతదేశ సంస్కృతితో మమేకమైనారని చెప్పవచ్చు. అయితే స్థానిక సంస్కృతి, విదేశీయుల రాక కూడా శాతవాహన సంస్కృతిలో ప్రధానాంశాలు అయినాయి. శాతవాహన కాలం నాటికి తెలుగు సమాజం గ్రామ సంస్కృతి నుండి నగరీకరణ వైపు, వర్ణవ్యవస్థ వైపు వేగంగా అడుగులు వేసింది. శాతవాహన కాలం నాటికే వర్ణవ్యవస్థ తెలుగుదేశంలో వేళ్లూనుకుంది. సమాజం ప్రధానంగా నాలుగు వర్ణాలుగా విభజించబడింది. బ్రాహ్మణులు వైదిక కర్మలు నిర్వహించడంలో, వైశ్యులు నిగమసభల (వాణిజ్యం) నిర్వహణలో నిమగ్నమయ్యారు. శూద్రుల్లో ప్రధానమైన వృత్తులు హాలిక, గోలిక (గోపాల), కోలిక (పద్మశాలి), వధిక (వడ్రంగి), కుమ్మర, కులార మొదలైనవి. వీరిలో పెక్కురు శ్రేణులుగా ఏర్పడి వాటి అధ్యక్షులైన "శ్రేష్ఠుల" అధీనంలో పని చేసేవారు. కాలక్రమంలో ఇలాంటి వృత్తులు, శ్రేణులే ఉపవర్ణాలు, కులాలుగా ఏర్పడ్డాయి. శాతవాహనులు రాజులైనప్పటికీ గౌతమీపుత్ర శాతకర్ణి వివరాలు గల నాసిక్ శాసనం ఆధారంగా అతడు 'ఏకబ్రాహ్మణు'డని, 'ద్విజవర కుటుంబవివర్ధను'డని, వర్ణసాంకర్యాన్ని నిలిపాడని తెలుస్తుంది. కాని "శాతవాహనులు ఆంధ్రులు, బ్రాహ్మణ మతస్థులు, శూద్ర కులస్థులు, కృషీవల కుటుంబులు అయిన పాలకులు" అని కొర్లపాటి శ్రీరామమూర్తి సిద్ధాంతీకరించారు. వీరు మహారాష్ట్రలోని స్థానికులతో, శకులు మొదలగు కొత్తగా వచ్చిన విదేశీయులతో సంబంధాలు నెరిపారు. శివశ్రీ శాతకర్ణి శక రాజు రుద్రదాముని కుమార్తె రుద్రదమనికను వివాహం చేసుకోవడం లాంటివి ఇందుకు ప్రబల నిదర్శనాలు.

విదేశీయులైన శక, పహ్లవ, యవనులు భారతదేశ స్థానిక ఆచారాలతో, మతాలతో (హిందూ, బౌద్ధాలతో) మమేకమయ్యారు. పితృస్వామిక సమిష్టి కుటుంబ వ్యవస్థ ఆచరణలో ఉండేది. గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీపుత్ర శాతకర్ణిలాంటి పేర్లు, రాజస్త్రీలు చేసిన దానాలు మాతృస్వామిక వ్యవస్థ ప్రాముఖ్యాన్ని చాటుతున్నాయని కొందరు భావించినప్పటికీ, అవి బౌద్ధ సాంప్రదాయాన్ని మాత్రమే సూచిస్తున్నాయని కొందరు, బహుభార్యత్వాన్ని సూచిస్తున్నాయని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు. ఇంకొందరేమో రాజుల పేర్లలోని గౌతమి, వాశిష్ఠి అనే పదాలు వారి పుట్టుక ఆయా నదుల ప్రాంతాల్లో జరిగింది అంటారు. ఏమైనప్పటికీ స్త్రీలకు గౌరవస్థానం ఉండేదనే తెలుస్తుంది. స్త్రీలు చేసిన దానధర్మాలు వారికి సొంత ఆస్తి ఉండేది అనే భావనకు తావిస్తున్నాయి. గాథాసప్తశతిలోని ఎన్నో గాథలను స్త్రీలు/కవయిత్రులు రచించారు. సేనాపత్ని, మహాభోజకి లాంటి పదాలు కూడా వారి గౌరవ స్థానాన్నే తెలుపుతున్నాయి. అయితే బహుభార్యత్వం, వితంతు బ్రహ్మచర్యం, భరుకచ్ఛ లాంటి రేవు పట్టణాల నుండి నాట్యకత్తెలను దిగుమతి చేసుకోవడం వంటి చర్యలు స్త్రీల పట్ల వివక్షతకు, వారు భోగ వస్తువులుగా ఉపయోగపడేవారనే విషయాలకూ తావిస్తున్నాయి. ఫణిగిరి, అమరావతి శిల్పాలు, ఆ కాలపు చిత్రలేఖనాలను బట్టి ఆ కాలంలో ప్రజలు కనీస వస్త్రధారణ చేసేవారని, కాని ఆభరణాలు మాత్రం ఎక్కువగా ధరించేవారని తెలుస్తుంది. స్త్రీలు రవికలను ధరించేవారు కాదు. కబరీ బంధాలు ధరించేవారు. మహారాష్ట్రలో ఉన్న శాతవాహనుల మరో రాజధాని 'పైఠాన్'లోని స్త్రీలు వేసుకునే కొంగును తెలుగు -స్త్రీలు వేసుకోవడం వల్ల దానికి తెలుగు ప్రాంతంలో 'పైట' అనే పేరు వచ్చిందని కొందరు మేధావులు భావించారు. ప్రజలు ప్రధానంగా గ్రామాలలో నివసించినప్పటికీ నాటి వ్యాపార ప్రాధాన్యం (రోమన్ సామ్రాజ్యంతో) రేవులు, నదులు ఇతర నీటి వసతుల దగ్గర నగరాల సంఖ్య పెరగడానికి కారణమయ్యింది. భరోచ (భరుకచ్ఛ), సోపార, కళ్యాణ, పైఠాన్, కోటిలింగాల, ధాన్యకటకం నాటి ప్రధాన వ్యాపార కూడలులు, పట్టణాలు. కోటిలింగాల సమీప గ్రామాలలో ఇప్పటికీ ఉన్న 'బిదారి' అనే ఇంటిపేరు నాటి వ్యాపార ప్రాధాన్యాన్ని తెలుపుతున్నది.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# AI తో
# పిల్లల ఊహాశక్తికి కొత్త రెక్కలు




పిల్లల ఊహాశక్తిని పెంపొందించడంలో కథలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు, కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత కథా జనరేటర్లు పిల్లలకు కొత్త అవకాశాలను అందిస్తూ, వారి వినూత్న ఆలోచనలకు సరికొత్త దారులను చూపిస్తున్నాయి. చిన్నారులు ఒక పాత్ర, స్థలం లేదా పదం ఇచ్చిన వెంటనే, AI ఆసక్తికరమైన కథను సృష్టిస్తుంది. ఆ కథలను వారు తమ అనుగుణంగా మార్చుకుని, కొత్తగా సృష్టించుకోవచ్చు. దీని వలన వారి సృజనాత్మకత మాత్రమే కాకుండా, భాషా నైపుణ్యాలు కూడా మెరుగుపడతాయి. AI కథలు కేవలం వినోదం కాకుండా, భావాలను అర్థం చేసుకోవడం, ఇతరుల మనోభావాలను గ్రహించడం నేర్పిస్తాయి. ఉపాధ్యాయులు తరగతుల్లో AI టూల్స్ ఉపయోగించి పాఠ్యాంశాలను మరింత ఆసక్తికరంగా బోధించవచ్చు. ఈ విధంగా, AI పిల్లల ఊహాశక్తికి కొత్త రెక్కలు కట్టి, భవిష్యత్తు రచయితలుగా, సమాజ సేవకులుగా ఎదగడానికి దోహదపడుతోంది.

– బాలచెలిమి డెస్క్




# బొమ్మలకే ప్రాణాలొస్తే!

అమ్మా! నేనాడుకునే
బొమ్మలకే ప్రాణమొస్తే
మస్తుగ వారందరికి
దోస్తునయ్యి పోతానే.

ఉట్టుట్టిగ మేమొండే
మట్టి వంటలన్ని కూడ
పాయసంగ మారిపోతే
తీయగ మెక్కేస్తామే

కొల్లలుగా నేనేరే
చిల్లపెంకులన్ని కూడ
బంగారుగ మారిపోతే
పొంగిపోయి మురిసెదమే.

– డా. ఎన్. గోపి
కీలుగుర్రం (బాల గేయాలు)



# బంగారం కల్తీ కనిపెట్టే సూత్రం

పూర్వం రోము సమీపాన సైరాక్యూస్ అనే నగరం ఉండేది. ఆ నగరాన్ని హీరో అనే రాజు పరిపాలించే వాడు. ఆ నగరంలోనే ప్రముఖ విజ్ఞానవేత్త 'ఆర్కిమిడీసు' ఉండేవాడు. ఆ రాజు బంగారంతో ఒక కిరీటం తయారు చేయించాడు. ఆ బంగారంలో కల్తీ కలిసినట్లు ఆయనకు అనుమానం వచ్చింది. రాజుగారు ఆర్కిమిడీసును పిలిపించాడు. దానితో ఆర్కిమిడీసుకు ఒకటే ఆలోచన. కిరీటం చెడగొట్టకుండా దానిలో కల్తీ కలిసిందా? లేదా? అని తెలుసుకోవాలి. ఇది పెద్ద చిక్కేనే!' అంటూ నిద్రాహారాలు మాని రాత్రీ పగలూ ఆలోచించసాగాడు.

వెంటనే చల్లని నీటిలో స్నానం చేయాలనుకున్నాడు. ఆర్కిమిడీసు తొట్టెలో స్నానం మొదలుపెట్టాడు. ఉన్నట్లుండి ఆయన బుర్రలో మెరుపులా ఓ ఆలోచన తళుక్కుమంది. అంతే ఆ పళంగానే నీళ్ళ తొట్టిలో నుంచి లేచి మైమరచి 'యూరేకా! యూరేకా!' అని అరుస్తూ పరుగు తీశాడు. 'యూరేకా!' అంటే 'కనుక్కున్నాను' అని అర్థం.

రాజుగారి సమస్యకు జవాబు. నీళ్ళ తొట్టెలో దొరికింది. ఆర్కిమిడీసు నీటి తొట్టెలోకి దిగాడా? వెంటనే నిండా ఉన్న నీటి తొట్టెలో నీరు కొంత పొర్లిపోయింది. అలా పొర్లిపోయిన నీరు ఆయన బరువుతో సమానమని తెలిసింది.

రాజు గారి దగ్గరకు పోయి వెంటనే ఓ పాత్రలో నీరు పోయించి కిరీటం అందులో వేశాడు. దానిలో నుంచి పొర్లి వచ్చిన నీటిని కూడా ఓ పాత్రలో పట్టించాడు. కిరీటంలో వాడినంత మంచి బంగారం తెప్పించి దానిని కూడా నీటి పాత్రలో వేశాడు. అలా పొర్లిన నీటిని కూడా ఓ పాత్రలో పట్టించాడు. రెంటికి కొంత తేడా వుంది. వెంటనే కంసాలిని పిలపించారు. 'మీరు కిరీటంలో ఫలానా అంత వెండి కలిపారా లేదా?' అని ఆర్కిమిడీసు అడిగారు. వెంటనే కంసాలి నోరు వెళ్లబెట్టాడు. రాజు గారు చాలా సంతోషించారు.

ఈ సంఘటన జరిగి 2200 సంవత్సరాలు అయింది. అయినా నేటికీ గణితంలో ఈ సూత్రం 'ఆర్కిమెడీసు సూత్రం'గా నిలిచి ఉంది. అదే 'పదార్థాల తారతమ్య సాంద్రత – భౌతిక సిద్ధాంతం' అనే సూత్రం.

– 'బాల కథా సౌరభం' నుండి...



# గుడు గుడు గుంచెం

గుడు గుడు గుంచెం
తిను తిను కొంచెం
గుడు గుడు గుంచెం
తిను తిను కొంచెం
గుడు గుడు గుంచెం
విను విను కొంచెం
గుడు గుడు గుంచెం
నడు నడు కొంచెం

గుడు గుడు గుంచెం
విను విను కొంచెం
గుడు గుడు గుంచెం
తిను తిను కొంచెం
వినమ్మా... విను..
తినమ్మా... తిను..
విను.. విను.. విను..
తిను.. తిను.. తిను..

- గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105



## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

పేరు : -------------------
తండ్రి పేరు : -------------------
పుట్టినతేదీ : -------------------
చిరునామా : -------------------
-------------------
-------------------
పిన్ : -------------------
హాబీలు : -------------------
మొబైల్ : -------------------
ఇ-మెయిల్ : -------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



# పుస్తక పరిచయం

పిల్లల్లో భాషా సాహిత్యం పట్ల ఆసక్తి, అభిరుచి పెంపొందించి, పఠనాసక్తి ద్వారా వారి సృజనాత్మకతకు వెలుగునివ్వాలన్న ఉద్దేశంతో పుస్తకరూపంలో ప్రతిఫలించిన ఈ బాల రచయితల ప్రయత్నానికి మేము హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ ప్రయత్నంలో విద్యార్థులను బాల సాహిత్య దిశగా ప్రేరేపిస్తున్న ఉపాధ్యాయులు, పుస్తక ప్రేమికులు, తల్లిదండ్రులకు మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. చిన్నారుల సాహిత్య యాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, వారికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు. బాలల దినోత్సవ శుభాకాంక్షలతో,

– వేదకుమార్ మణికొండ, సంపాదకులు, 'బాలచెలిమి'



ప్రకృతి

# అంతరించిపోతున్న దక్షిణ జాయింట్ పెట్రేల్ పక్షి



సదర్న్ జయింట్ పెట్రెల్ (Macronectes giganteus) అనే సముద్ర పక్షి దక్షిణ మహాసముద్రం మరియు అంటార్కిటిక్ ప్రాంతానికి దగ్గరలో ఉన్న కొన్ని ద్వీపాలలో కనిపిస్తుంది. దీనికి అంటార్కిటిక్ జయింట్ పెట్రెల్, స్టింకర్, జయింట్ ఫల్మర్ వంటి ఇతర పేర్లు కూడా ఉన్నాయి. దీనిపేరు గ్రీకు భాషలోని macros (పెద్ద), nectes (ఈతగాడు) అనే పదాల నుండి వచ్చింది. ఈ పక్షి పెద్దదైన శరీరాన్ని కలిగి సముద్రంలో చాలా వేగంగా ఈత కొట్టగలదు.

ఈ పక్షి శరీరం పొడవు సుమారు 86-99 సెంటీమీటర్లు, రెక్కల వెడల్పు 185-205 సెంటీమీటర్ల మధ్య ఉంటుంది. దీని ముక్కు పసుపు రంగులో ఉండి చివరలో ఆకుపచ్చటి టిప్ ఉంటుంది. కాళ్లు బూడిద లేదా గులాబీ రంగులో ఉంటాయి. అవి చీకటి మోర్ఫ్ గోధుమ రంగులో, తెల్ల మోర్ఫ్ తెలుపు రంగులో, మచ్చలతో కనిపిస్తాయి..

మగ పక్షులు కొద్దిగా బరువుగా, గజిబిజిగా ఉంటాయి. అవి 5.1 నుండి 12.3 కిలోల బరువుండగా, ఆడ పక్షులు 2.3 నుండి 5.6 కిలోల మధ్య ఉంటాయి. ఇవి సాధారణంగా తక్కువ ఎత్తున్న కొండలపై, సముద్ర తీర ప్రాంతాలలో లేదా రాళ్ల మధ్య గూడులు కడతాయి. ఎలాంటి కఠిన వాతావరణ పరిస్థితుల్లోనైనా పిల్లల్ని కాపాడుతూ జీవించగలగడం వీటి ప్రత్యేకత.


ఈ పక్షి శవాహారి (శవాలను తినే జీవి). చనిపోయిన సీల్స్, పెంగ్విన్లు, ఇతర పక్షుల శవాలను తింటుంది. అందుకే దీనిని కొందరు "సముద్రపు గద్ద" అని కూడా పిలుస్తారు. ఇది చేపలు, క్రిల్, ఇతర చిన్న సముద్ర జీవులను కూడా ఆహారంగా తీసుకుంటుంది. తమ శరీరంలో తయారయ్యే నూనెను ఉమ్మి చేసి పిల్లలకు ఆహారంగా పెడతాయి. ఈ నూనెలో ప్రోటీన్, కొవ్వులు ఉండటంతో అది శక్తివంతమైన పోషకాహారంగా ఉపయోగపడుతుంది. ఈ పక్షులు సుమారు 15 నుంచి 30 సంవత్సరాల వరకు బతుకుతాయి.

గుడ్ల సంరక్షణలో ఆడ, మగ పక్షులు మారుతూ గూడులో కాపలా ఉంటాయి. ఒక గుడ్డు పగలడానికి సుమారు 58 నుంచి 65 రోజులు పడుతుంది. పిల్లలు పుట్టాక సుమారు 120 రోజుల పాటు తమ సంరక్షణలో పెంచుతాయి. శత్రువులు దగ్గరకి వస్తే, ఈ పక్షులు తమ శరీరం నుంచి దుర్వాసన కలిగిన నూనెను చిమ్ముతాయి. వీటిపై దాడి చేయాలనుకునే జంతువులను భయపెట్టగలదు.

ఇప్పుడు ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ పక్షుల సంఖ్య తగ్గుతోంది. అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ మండలి (IUCN) ఈ పక్షిని "లీస్ట్ కన్సెర్న్" జాబితాలో ఉంచింది. అంటే ప్రస్తుతం ఇది పెద్దగా ప్రమాదంలో లేదు. అయినా, ప్లాస్టిక్ కాలుష్యం, చేపల వేటలో చిక్కుకోవడం, వాతావరణ మార్పులు వంటి కారణాల వల్ల ఈ పక్షుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశముంది.

అయినా సరే, సదర్న్ జయింట్ పెట్రెల్ దాని శక్తివంతమైన శరీరం, సహజ రక్షణ నైపుణ్యాలు, ప్రత్యేక జీవనశైలితో దక్షిణ మహాసముద్రంలో నివసించే అద్భుతమైన సముద్ర పక్షిగా నిలుస్తుంది.

– సచిన్ కోత్వాల్





# పేరాశ

అనగనగా ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. తను ఒక చిన్న ఊరిలో తన భార్య, పిల్లలతో ఉండేవాడు. తన జీవనం సాగించడానికి గుడిలో పూజారి కొలువు చేయడంతో పాటు గృహప్రవేశాలు, శాంతి పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు వంటి కార్యాలు జరిపించి దక్షిణ పుచ్చుకునేవాడు. ఒకానొక రోజున ఆ బ్రాహ్మణుడు బాగా ఉన్నవారి ఇంట్లో వ్రతం జరిపించి దక్షిణ పుచ్చుకొని ఇలాంటివి ఇంకో 3, 4 వ్రతాలు రోజుకు బాగా ఉన్న వారి ఉంట్లో జరిపిస్తే బాగా డబ్బు వస్తుంది అని ఆలోచిస్తూ దారి వెంట వస్తుంటాడు. అప్పుడు అక్కడ ఒక చిన్న గుడారంలో కుండల వ్యాపారి దగ్గర ఆగుతాడు. వస్తున్న బ్రాహ్మణుని చూసిన కుండల వ్యాపారి బ్రాహ్మణులు ఇంటికి వస్తే, భోజనం చేస్తే మంచిదని భావించి ఆ బ్రాహ్మణుడికి కడుపు నిండా పెరుగు అన్నం పెట్టి నిద్రపోడానికి స్థలం చూపించి ఆ వ్యాపారి పక్క గదిలోకి వెళ్ళిపోతాడు. ఆ వ్యాపారి చూపిన మంచంపై పడుకున్న బ్రాహ్మణుని కాళ్ళ వద్ద ఖాళీ కుండలు ఉన్నాయి. కడుపు నిండా తిని నిద్రించిన బ్రాహ్మణుడు మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. నిద్రలో కల కనడం మొదలు పెట్టాడు. ఆ కలలో తాను బాగా ధనవంతుడు అయిపోయి నట్టు తన భార్యను దాసిలా ఊహించుకుని కాలితో తన్నడం ప్రారంభిస్తాడు. కాలి దగ్గర కుండలు ఉండడంతో కుండలు పగిలి పోతాయి. అలికిడి విన్న వ్యాపారి వచ్చి కుండలకు ధర కట్టివ్వంటాడు. అది విన్న బ్రాహ్మణుడు ఆశ్చర్యపోయి తన దగ్గర ఉన్న డబ్బు మొత్తం వ్యాపారికి చెల్లిస్తాడు ఏదైతే తాను బాగా ఉన్న వారి ఇంట్లో వ్రతంలో సంపాదించాడో అది. ఇందులో నీతి ఏమిటంటే ఏ మనిషి అయినా పేరాశకు పోకూడదు.

– కె. లక్షణ

7వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్



# కలంచెలిమి



**డి. వెంకట లక్ష్మి**
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పెద్ద బోదనం, నంద్యాల.



**చెట్టి వర్షిత్**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
గంభీర్‌పూర్.

**నేవూరి మీనాక్షి**
10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ఎల్లారెడ్డిపేట.



**కనకం వినయ్**
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, పాలంపేట (రామప్ప),
ములుగు.






**బి. వైష్ణవి**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
బాలరాజుపల్లి.



**ఆయేష మహీర**
3వ తరగతి, సెయింట్ అలియుద్దిన్
స్కూల్, బాల్‌కొండ.

# నోబెల్ 2025 బహుమతి గ్రహీతలు



నోబెల్ బహుమతి ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డు. ఇది ప్రతి ఏడాది గొప్ప ప్రయోగాలు, కృషి, సేవలు చేసిన వ్యక్తులు, సంస్థలకు ఇవ్వబడుతుంది. ఈ బహుమతులు 1895లో స్వీడిష్ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ అనే శాస్త్రవేత్త పేరు మీదుగా స్థాపించబడ్డాయి. 1901 నుండి నోబెల్ బహుమతులు భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వైద్యం, సాహిత్యం, శాంతి, ఆర్థికశాస్త్రం వంటి విభాగాల్లో ప్రదానం చేయబడతాయి. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి మాత్రం నేరుగా ఆల్ఫ్రెడ్ నోబెల్ స్థాపించినది కాదు. ఇది 1969లో స్వీడిష్ కేంద్ర బ్యాంక్ అయిన స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రారంభించబడింది, కానీ ఇది కూడా నోబెల్ బహుమతుల భాగంగా పరిగణించబడుతుంది. అవార్డు గ్రహీతలకు బంగారు పతకం, సర్టిఫికెట్, మరియు డబ్బు బహుమతి ఇవ్వబడుతుంది. ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో బహుమతులు ప్రదానం చేయబడతాయి (శాంతి బహుమతి ఒస్లోలో). ఈ బహుమతులు మానవతా సేవలకు, శాంతి కోసం చేసిన కృషికి, మరియు దేశాల అభివృద్ధికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. 1901 నుండి 2025 వరకు నోబెల్ బహుమతులు మరియు ఆర్థిక శాస్త్రాల్లోనూ ఉన్న స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ బహుమతిని 1,023 మంది వ్యక్తులు మరియు సంస్థలకు 632 సార్లు ప్రదానం చేశారు. కొందరు ఒకటి కంటే ఎక్కువసార్లు నోబెల్ బహుమతిని అందుకున్నారు, దీనితో మొత్తం 987 మంది వ్యక్తులు మరియు 28 సంస్థలు ఉన్నాయి.

| సంవత్సరం | విభాగం | దేశం / బహుమతి గ్రహీతలు | కృషి / ప్రత్యేకత |
|---|---|---|---|
| 2025 | భౌతిక శాస్త్రం | జాన్ క్లార్క్ (అమెరికా), మిచెల్ హెచ్.డెవోరెట్ (ఫ్రాన్స్/అమెరికా), జాన్ మార్టినిస్ (అమెరికా) | ఎలక్ట్రిక్ సర్క్యూట్లలో క్వాంటం టన్నెలింగ్ మరియు శక్తి పరిమాణీకరణపై పరిశోధన |
| 2025 | రసాయన శాస్త్రం | సుసుము కిటగవా (జపాన్), రిచర్డ్ రాబ్సన్ (ఆస్ట్రేలియా), ఒమర్ యాగీ (అమెరికా) | లోహ-సేంద్రీయ చట్రాల అభివృద్ధికి కృషి |
| 2025 | వైద్య శాస్త్రం | మేరీ బ్రుంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచి (అమెరికా/జపాన్) | రోగనిరోధక సహనంపై (Immune tolerance) పరిశోధనలు |
| 2025 | సాహిత్యం | లాస్లో క్రాస్జ్నాహొర్కై (హంగేరీ) | అపోకలిప్టిక్ పరిస్థితుల్లో కళలో ఉన్న తాత్వికతను ప్రదర్శించే రచనలు |
| 2025 | శాంతి | మరియా కొరినా మచాడో (వెనిజులా) | ప్రజాస్వామ్య హక్కుల కోసం నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటం |

– బాలచెలిమి డెస్క్



యం. వేదకుమార్, డా.చొక్కాపు వెంకటరమణ · జి. అశోక్ · ఎస్. విజయ · పద్మజ · యు. పద్మ · వి.ఆర్. శర్మ · బి.వి.ఎన్. స్వామి · అబ్దుల్ ఘనీ · ఎ.వి.ఎస్. లక్ష్మి · బి. దుర్గయ్య · కె. బుచ్చిరెడ్డి · డా. పత్తిపాక మోహన్

# బాలచెలిమి ఆత్మీయం భావితరానికి ఉషోదయం



ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్, హిమాయత్‌నగర్ ప్రాంగణంలో బాలచెలిమి ఆత్మీయులు

రేపటి తరం కోసం, సమాజ హితం కోసం, నైతిక విలువల పెంపు కోసం, బాలల్లో సాహిత్య అభిరుచి కోసం నిరంతరం కృషి చేస్తున్న బాల చెలిమి పత్రిక సంపాదకులు మణికొండ వేదకుమార్ గారి అధ్యక్షతన తేదీ.5.10.2025 ఆదివారం రోజు హైదరాబాద్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హై స్కూల్‌లో బాల చెలిమి ఆత్మీయ సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని బాల చెలిమి పత్రిక పై తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

నేషనల్ బుక్ ట్రస్ట్ సంచాలకులు పత్తిపాక మోహన్ గారు మాట్లాడుతూ...

"23 నెలల పాటు నిర్విరామంగా బాల చెలిమి ముచ్చట్లు, తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించుకోవడం చాలా గొప్ప విషయం. అదే విధముగా బాల చెలిమి నిర్వహిస్తున్న కథల పోటీలకు మంచి స్పందన వస్తుందన్నారు, బాల సాహిత్య కార్యశాలలు నిర్వహించడం, బాల చెలిమి గ్రంథాలయాల ఏర్పాటు వలన ఈ రోజు బాల సాహిత్య ప్రస్థానం అద్భుతంగా కొనసాగుతుంది అని తెలిపారు. బాల సాహిత్యంలో బాలల రచయితలకు, బొమ్మలు వేసే చిత్రకారులకు, అనువాదకారులకు, డిటిపి చేసే వారికి, ప్రచురణ కర్తలకు, వివిధ అవార్డులు ఇచ్చి ప్రోత్సహించాలని" అన్నారు.

బాల చెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ గారు మాట్లాడుతూ "బాల సాహిత్యం, బాల సాహితీ వేత్తలతో గత ఆరు సంవత్సరాలుగా ఆత్మీయ అనుబంధం ఏర్పడింది. ప్రపంచ తెలుగు మహాసభలలో రవీంద్రభారతిలో మొదటి సమావేశంగా బాల సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నప్పుడు, అక్కడి ఆదరణ చూసి సంతోషం కలిగించింది అన్నారు, బాల సాహిత్యంకు మంచి స్పందన ఉందని గ్రహించి దాని ద్వారా బాల చెలిమి ముచ్చట్లు కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగింది. బాలల



ఎస్. ఉమ



కె.వి. కృష్ణారావు



పి. రామకృష్ణ



సిహెచ్. రామన్



సి. కిరణ్



సిహెచ్. సుదర్శన్



జుగాష్‌విలి



కె. చిదంబరం



జాతీయ బాలచెలిమి పోటీ కథలను పరిశీలిస్తున్న బాలచెలిమి బృందం


కోసం కథల పుస్తకాలు ముద్రించడం, బాల గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం, 15 పెద్ద గ్రంథాలయాలు, 100 చిన్న గ్రంథాలయాలు 100 పుస్తకాలతో ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. కనీసం వారంలో రెండు సెషన్స్‌లలో లైబ్రరీకి సమయం ఇవ్వాలి. పిల్లలు పుస్తకాలు ఇంటికి తీసుకువెళ్ళి చదవడం అలవాటు చేసుకునేలా భాషోపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని పిల్లల సత్ప్రవర్తనకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేయడానికి సాహితీవేత్తలు కృషి చేయాలి. గ్రంథాలయాల్లో ఎటువంటి పుస్తకాలు పిల్లలకు ఉపయుక్తంగా ఉంటాయో ఒక జాబితా తయారు చేయవలసిన అవసరం ఉంది. పిల్లలు పుస్తకాలు చదవడం వలన మంచి వ్యక్తిత్వం నిర్మాణము జరుగుతుంది. వారిలో ఆత్మ స్థైర్యం పెరుగుతుంది. పోటీ ప్రపంచంలో గెలవాలి అనే సొంత ఆలోచన కలుగుతుంది. పౌల్ట్రీ ఫామ్ స్కూల్ విద్యా విధానం పోవాలి. కేవలం మార్కుల కోసం చదివితే ఎదగలేము మార్కులు ఒక్కటే మంచి జీవితాన్నీ తీసుకురావు అన్నారు. ప్రతి దసరా తర్వాత బాల సాహితీ వేత్తలతో అలయ్ బలయ్ నిర్వహిస్తామన్నారు. ఈ సారి కథల పోటీకి అధిక సంఖ్యలో కథలు రావడం సంతోషంగా ఉందని అన్నారు. బాల చెలిమి కథల పోటీ కన్వీనర్ గరిపెల్లి అశోక్ గారు మాట్లాడుతూ బాల చెలిమి కథల పోటీకి పిల్లల విభాగంలో 714 కథలు, యువ రచయితల విభాగంలో 48 కథలు, పెద్దల విభాగంలో 214 కథలు వచ్చాయి. సాహితీవేత్తల ఆధ్వర్యంలో కథల ఎంపిక జరిగిందని అన్నారు. ఈ స్పందన భవిష్యత్ కార్యక్రమాలను నిర్దేశిస్తుంది అని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ గారు మాట్లాడుతూ కథలలో మ్యాజిక్‌లు లాజిక్‌లు ఉండాలి, తర్వాత ఏమిటి అనే ఆసక్తి కలిగించేలా ఉండాలి, నవ్విస్తూ, కవ్విస్తూ, పిల్లలను హత్తుకునే విధముగా ఉండాలని అన్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిట్టి చిలకమ్మా గేయ రచయిత్రి బల్ల సరస్వతి గారు మాట్లాడుతూ పిల్లలకు నీతి పద్యాలు నేర్పించాలని, అవి వారు కంఠస్థం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేస్తే, జీవితానికి సరిపడా ఆనందం కలుగుతుందని అన్నారు. విద్యార్థుల దృష్టి చదువు పై మళ్ళించడానికి 1962లో చిట్టి చిలకమ్మా అనే గేయాన్ని వ్రాసి, పిల్లలకు వినిపించానని చెప్పారు. ఉపాధ్యాయురాలిగా తన జీవన ప్రస్థానాన్ని, నాటి రోజుల్లో బాల గేయాలకు విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అయ్యారో వివరించి చెప్పారు. వందలాది బాల గేయాలు వ్రాసానని చెప్పారు. తను వ్రాసిన ఒకటి ఒకటి, చిట్టి చిట్టి మిరియాలు అనే బాల గేయాలు పాడి వినిపించారు. బల్ల సరస్వతి గారు వ్రాసిన 600 పేజీలకి పైగా ఉన్న "కలె నేత" అనే పుస్తకాన్ని వేదకుమార్ గారికి బహుకరించారు. అనంతరం బల్ల సరస్వతి గారిని బాల చెలిమి తరఫున వేదకుమార్ గారు సన్మానించారు.



బల్ల సరస్వతి
చిట్టి చిలకమ్మా గేయ రచయిత్రి

బాల చెలిమి మాస పత్రిక గురించి, అందులో ఎటువంటి శీర్షికలు ఉండాలి అనే అభిప్రాయ వేదికలో బాల సాహితీవేత్తలు పాల్గొని తమ తమ అభిప్రాయాలు వెల్లడించారు. పత్రిక బాగుందని, ఈ రోజుల్లో పుస్తక రూపంలో ఉన్న ఏకైక పత్రిక ఇదే అని, పత్రికలో ప్రతి శీర్షిక బాగుందని, బాల సాహిత్య వికాసానికి పత్రిక చేస్తున్న కృషి గొప్పదని, పత్రికల్లో పిల్లలు వ్రాసిన రచనలు ఎక్కువ ఉండాలని, కథల నిడివి తక్కువ ఉండాలని, వివిధ సాహిత్య ప్రక్రియలకు అవకాశం కల్పించాలని పలువురు అభిలాషించారు.



ఎం. కామేశ్వర్‌రావు



పి. వెంకటేశ్వర్లు



పి. సురేందర్



ఎల్. అనీల్



వి. రాజు



ఎస్. వెంకటనారాయణ



బాలచెలిమి ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో బల్ల సరస్వతి గారిని సన్మానిస్తున్న యం. వేదకుమార్, డా. పత్తిపాక మోహన్, అశోక్, బాలచెలిమి రచయితలు

**బాల చెలిమి పత్రిక పై బాల సాహితీవేత్తల అభిప్రాయాలు:**

**చెన్నూరి సుదర్శన్:** బాల చెలిమిలో అన్ని శీర్షికలు బాగున్నాయి. పేరులో బాల అనే అక్షరాలు పెద్ద సైజులో ఉంటే బాగుంటుంది.

**వి.ఆర్. శర్మ:** పత్రికలో నాటికలు, స్కిట్స్‌లకు చోటు కల్పించాలి. పిల్లల రచనలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. బాల చెలిమి ముచ్చట్లు మళ్ళీ నిర్వహించాలి.

**ఉప్పల పద్మ:** బాల చెలిమి గ్రంథాలయాలు ఆకర్షణీయంగా ఉండడానికి స్టడీ టేబుల్స్, పుస్తకాల రాక్స్ ఇస్తే బాగుంటుంది.

**కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి:** కథల నిడివి తగ్గించాలి. విద్యార్థులు చదవడానికి సమయం సరిపోయేలా కథలు అర పేజీలో ఉండాలి.

**చేరాల రామన్:** పిల్లల అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కథల సంఖ్య పెంచాలి. పిల్లలు వ్రాసిన రచనలు ఎక్కువ ఉండాలి.

**కిరణ్ కుమార్:** ముందు తరాలకు ఉపయోగపడే విధంగా బాల సాహిత్య ప్రస్థానంకు సంబంధించిన శీర్షికలు ఉండాలి. పిల్లలతో వ్రాయించాలి.

**ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి:** పిల్లలలో వేదిక భయం పోయేలా కథా పఠనం పోటీలు నిర్వహించాలి. చెలిమి క్లబ్‌లు ఏర్పాటు చేయాలి.

**భైతి దుర్గయ్య:** విద్యా సంబంధిత, సాహితీ ప్రముఖులను విద్యార్థులు ఇంటర్వ్యూ చేసేలా ఒక శీర్షిక ఉంటే బాగుంటుంది.

**కెవి. కృష్ణారావు:** ప్రపంచ బాల సాహిత్య కథలు పరిచయం చేయాలి. సృజనాత్మకత కోసం చిత్రలేఖనానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

**పైడిమర్రి రామకృష్ణ:** పిల్లల కోసం ప్రింట్ రూపంలో వస్తున్న ఏకైక పత్రిక. రచనలు అందగానే రచయితలకు సమాచారం ఇవ్వాలి.

**మాచిరాజు కామేశ్వరరావు:** తమ ఊరు గురించి కథ పేరుతో ఒక శీర్షిక ఉండాలి. పత్రిక ఆకర్షణీయంగా ఉంది.

**పెందోట వెంకటేశ్వర్లు:** పేజీలు పెంచాలి. ఏకపాత్రాభినయం శీర్షిక ఉండాలి. లేఖలు బాగున్నాయి.

**వేల్పుల రాజు:** పిల్లలకు స్ఫూర్తిదాయకంగా ఉండడం కోసం ఆదర్శ విద్యార్థి శీర్షిక ఉండాలి.

**అబ్దుల్ ఘనీ:** ప్రతి శీర్షిక ఒక పేజి వరకు ఉండాలి. పత్రిక విద్యార్థులకు చేరేలా విద్యా శాఖ దృష్టికి తీసుకెళ్లాలి.

**డా. పగిడిపల్లి సురేందర్:** బాలలను నవ్వించడానికి హాస్య కథలు, కవితలు పత్రికలో ఉంటే బాగుంటుంది.

**కూర చిదంబరం:** మెదడుకు మేత, ఫజిల్స్ రూపంలో ఉండే కథలకు అవకాశం ఉండాలి. చిన్న చిన్న నాటికలు కూడా ఉండాలి.

**సమ్మెట ఉమాదేవి:** స్వతంత్ర సమర యోధుల జీవిత చరిత్రలు, స్ఫూర్తిదాయక మహిళలకు సంబంధించి సులభ శైలిలో శీర్షికలు ఉండాలి.

**డా. సమ్మెట విజయ:** నైతిక విలువలు పెంచే నాటికలు ఉండాలి. కథల సంఖ్య పెంచాలి. అనువాద రచనలకు ఒక శీర్షిక కేటాయించాలి.

**డా. బివియన్. స్వామి:** భాషేతర విషయాలపై దృష్టి పెట్టి, పాఠ్యాంశాల ఆధారంగా ఒక శీర్షిక ఉండాలి. తరగతి గదుల్లో కథలు, నాటికలు చెప్పబడాలి.

**వెంకట నారాయణ:** బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణ బాగుంది. పర్యావరణ, జంతువులు, నదులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

విజయ, మంజుల, జుగాష్ విలి, ప్రభాకర్, కైజర్, సచిన్ మొదలగు వారు పాల్గొన్నారు.

**– భైతి దుర్గయ్య**

m : 99590 07914

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కడవేర్గు.

# కడవేర్గు పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ప్రారంభం

2025 సెప్టెంబర్ 20, శనివారం: సిద్ధిపేట జిల్లా చేర్యాల మండలంలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి గ్రంథాలయం ఘనంగా ప్రారంభమైంది.

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల విద్యా అభివృద్ధి కోసం బాలచెలిమి పత్రిక ద్వారా మంచి సాహిత్యాన్ని అందిస్తూ, అదే పేరుతో బాలచెలిమి గ్రంథాలయాలు స్థాపిస్తున్న చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల కోసం రూ. 10,000 విలువైన బాలసాహిత్య పుస్తకాలను అందించి ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినందుకు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మరియు బాలచెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్, కన్వీనర్ గరిపల్లి అశోక్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– **శ్రీమతి ఎం. రాజమణి,** ప్రధానోపాధ్యాయురాలు

విద్యార్థులు పుస్తకాలు చదివే అలవాటు పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో విజయం సాధించగలరు.

– **చంద్రశేఖర్ రావు,** సీనియర్ ఉపాధ్యాయులు

ఈ గ్రంథాలయంలోని పుస్తకాలు విద్యార్థులలో ఆసక్తిని రేకెత్తించి, బుద్ధి వికాసానికి తోడ్పడతాయి.

– **ఉప్పల రమేశ్, పోలోజు లింగయ్య,** గణిత ఉపాధ్యాయులు

శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, సైన్సు అంశాలపై ఉన్న పుస్తకాలు పిల్లలలో విజ్ఞానపిపాసను కలిగిస్తాయి.

– **గర్దాసు కృష్ణమూర్తి, కరెడ్ల మమత,** సైన్స్ ఉపాధ్యాయులు




మహనీయుల జీవితచరిత్రలు విద్యార్థులలో చరిత్ర పట్ల అవగాహన పెంపొందిస్తాయి.

– **రామకృష్ణ,** సామాజిక ఉపాధ్యాయులు

కథల పుస్తకాలు చదవడం ద్వారా పిల్లల ఊహాశక్తి, సృజనాత్మకత పెరుగుతాయి.

– **సాజిదా బేగం,** హిందీ ఉపాధ్యాయురాలు

పుస్తకాలు విద్యార్థుల మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయి.

– **అరుణ, ప్రీతి, రవీందర్,** ఉపాధ్యాయులు

బాలచెలిమి గ్రంథాలయంలోని కథలు చదివిన తర్వాతే తాము కథల రచన వైపు ఆకర్షితులమయ్యాము. సిద్ధిపేట జిల్లా స్థాయిలో జరిగిన కథల పోటీల్లో బహుమతులు పొందగలిగాము.

– **రాయారపు పావని, మడికొండ శ్రీవిద్య,** పాఠశాల విద్యార్థులు

గ్రామస్థులు,తల్లిదండ్రులు మరియు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బాలచెలిమి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

– **గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ**
తెలుగు ఉపాధ్యాయులు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడవేర్గు గ్రా.
చేర్యాల మండలం, సిద్ధిపేట జిల్లా
m : 9490003295

# మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలై మెదడుకి పదును పెట్టే పొడుపు కథలు



పచ్చని పెట్టెలో
విచ్చుకోనుంది
తెచ్చుకో పోతేను
గుచ్చుకుంటుంది
- మొగిలి పువ్వు



కిట కిట తలుపులు
కిటారి తలుపులు
ఎప్పుడు తీసిన
చప్పుడు కావు
- కను రెప్పలు



పైనొక పలక
కిందొక పలక
పలకల నడుమ
మెలికల పాము
- నాలుక

చిటపట చినుకులు
చిటారి చినుకులు
ఎంత కురిసినా
వరదలు రావు
- కన్నీళ్లు



చెయ్యని కుండ
పొయ్యని నీరు
వెయ్యని సున్నం
తియ్యగనుండు
- కొబ్బరికాయ





రాజా వారి తోటలో
రోజా పూలు చాలా
చూసే వారే గాని
కోసే వారు లేరు
- నక్షత్రాలు

గోడ మీద బొమ్మ
గొలుసుల బొమ్మ
వచ్చే పోయే వారికి
వడ్డించు బొమ్మ
- తేలు





అంగట్లో ఉంటాను
అంగీ ఇంట్లో విప్పు తాను
ఎవరైనా పట్టుకుంటే
నూతిలోకి దూకుతాను
- అరటి పండు



- డా. చొక్కాపు వెంకటరమణ
అక్షరాలతో ఆటలు
TANA telugu tejam Kishora Vibhagam-1
m : 92465 20050

## "గరం గరం చాయ్" పుస్తక ఆవిష్కరణ

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో 01/10/2025 న ఆర్.సి. కృష్ణ స్వామి రాజు రచించిన 'గరం గరం చాయ్' పుస్తకం ఆవిష్కరించారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో త్రిపుర దమ్మ దీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎం.పి. నరసింహ రాజు, కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శైలమ్మ, కవి ఎన్. ధర్మయ్య, డాక్టర్ జి.ఎస్. ప్రసాద్, డి. చంద్రమోహన్ పాల్గొన్నారు.

## బాల సాహిత్య వికాసమే సమాజ ప్రగతి: డా. జె. చెన్నయ్య

సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో అక్టోబర్ 8న జరిగిన ఉగాది బాలల కథల పోటీ బహుమతుల కార్యక్రమంలో పాల్గొన్న డా. జె. చెన్నయ్య మాట్లాడుతూ, బాల సాహిత్య వికాసం రేపటి సమాజానికి శుభసూచకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27 మంది విద్యార్థులకు బహుమతులు, 29 మంది ఉపాధ్యాయులకు సన్మానాలు ఇచ్చారు. డా. సంపత్ కుమార్ తెలుగు భాషలో రచనలు చేయాలని సూచించారు. సుగుణ సాహితీ కన్వీనర్ భైతి దుర్గయ్య 6 ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గరిపెల్లి అశోక్ బాల సాహిత్యం అభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి కీలకమని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం పోటీ ప్రకటన-2025

తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ బాలల దినోత్సవం (14-11-2025) సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పద్యం/కవిత/గేయం, కథ, నాటికల పోటీలు నిర్వహిస్తోంది. దేశభక్తి, దేశ సమగ్రత, తెలంగాణ వైశిష్ట్యం, తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలు, పర్యావరణం-పచ్చదనం లాంటి అంశాలు తమ రచనలలో ఉండాలి. రచనకు సంబంధించిన పూర్తి వివరాలు (పేరు, తండ్రి పేరు, తరగతి మొదలైనవి) ప్రధానాచార్యుల ధృవీకరణ పత్రంలో మాత్రమే ఉండాలి. ఆ పత్రంలో ధృవీకరిస్తూ, వారి ఫోన్ నం., చిరునామా తప్పనిసరి. చివరి తేదీ: 05-11-2025. రచనలు పంపాల్సిన చిరునామా: కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ - 500004, ఫోన్: 9182445692

## తెలుగు వర్సిటీ-2023 బాల సాహితీ పురస్కారం డా. ఎం. హరికిషన్

బాల సాహిత్యంలో విలక్షణమైన రచనలకు గౌరవంగా, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా సాహితీ పురస్కారాలను అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2023 సంవత్సరానికి గాను బాల సాహితీ విభాగంలో ప్రముఖ రచయిత డా. ఎం. హరికిషన్ రాసిన "చందమామ చెప్పిన కథలు" గ్రంథం ఎంపికైనట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## పుల్లారామాంజనేయులకు డా. వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం

డాక్టర్ వేదగిరి రాంబాబు జయంతిని పురస్కరించుకుని ఈరోజు రవీంద్ర భారతిలో నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారుడు కె.వి. రమణాచారి గారు హాజరై ప్రముఖ బాలసాహిత్య రచయిత పుల్లారామాంజనేయులు గారికి "డా. వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం" ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయితలు విహారి, సింహప్రసాద్, సుధామ, వాణిశ్రీ గార్లు, అలాగే వేదగిరి రాంబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోతురాజు రచన 'నాన్నే నాహీరో' పుస్తకావిష్కరణ

సత్తుపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో చదువుతూ అద్భుతమైన బాలసాహిత్య రచన చేసిన ఆవుల పోతురాజు రచించిన 'నాన్నే నాహీరో' పుస్తకాన్ని ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేదరికం సృజనాత్మకతకు అడ్డు కాదని, పోతురాజు తాను గుడారంలో నివసించినా రచనా ప్రతిభతో ప్రేరణగా నిలిచాడన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎం. రమాదేవి, గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బాలల నేస్తం కథల పోటీకి ఆహ్వానం

బాలల నేస్తం పత్రిక 2026 సంక్రాంతి ప్రత్యేక సంచిక "సాహితీ సంక్రాంతి - బాలానందం" కోసం బాలల కథలు ఆహ్వానిస్తోంది. పిల్లలు స్వయంగా రాసిన కథలు, లేదా పెద్దలు రాసిన పిల్లల కథలు పంపొచ్చు. చివరి తేదీ నవంబర్ 14, 2025., కథలు టైపు చేసి వర్డ్ ఫైల్ రూపంలో పంపాలి. పంపాల్సిన వాట్సాప్ నెంబర్లు: 9491312522 / 9490182636

## గడుగ్గాయి సంక్రాంతి ప్రత్యేక సంచికకు రచనలు ఆహ్వానం

గడుగ్గాయి పిల్లల పత్రిక 2026 సంక్రాంతి ప్రత్యేక సంచిక కోసం 18 సంవత్సరాల లోపు పిల్లల నుండి కథలు, కవితలు, వ్యాసాలు కోరుతోంది. రచనలు పంపేందుకు చివరి తేదీ నవంబర్ 30, 2025. ఫలితాలు జనవరి 1, 2026న ప్రకటించబడతాయి. రచనలు gaduggai.prapancham@gmail.comకి పంపాలి.

# విభిన్న స్వరాల సృజనశీలి
# రావు బాలసరస్వతీ దేవి

రావు బాలసరస్వతీ దేవి తెలుగు సంగీతం, సినిమాలకు వెలుగునిచ్చిన మహానుభావురాలు. ఆమె 1928 ఆగస్టు 28న నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జన్మించారు. చిన్న వయస్సులోనే సంగీతంపై ఆసక్తి చూపిన బాలసరస్వతీకి అలత్తూరు సుబ్బయ్య గురువుగా సంగీత విద్యాబోధన చేశారు. ఆమెలోని సహజ ప్రతిభ, స్వరమాధుర్యం త్వరగానే అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం ఆరు సంవత్సరాల వయస్సులోనే "హిస్ మాస్టర్స్ వాయిస్" కంపెనీ ద్వారా తొలి గ్రేమోఫోన్ రికార్డు పొందడం ఆమె ప్రతిభకు నిదర్శనం. ఆ కాలంలో చిన్నారిగా గ్రేమోఫోన్ రికార్డు పొందడం ఎంతో గౌరవకరమైన ఘనతగా పరిగణించ బడింది.

ఆమె తన చిన్న వయస్సులోనే నటిగా కూడా రాణించారు. "సతి అనసూయ", "భక్త ధ్రువ" వంటి చిత్రాలలో పిల్లనటి గంగగా నటించి, స్వయంగా పాటలు కూడా పాడారు. 1936లో దర్శకుడు కె. సుబ్రహ్మణ్యం ఆమె ప్రతిభను గుర్తించి తమిళ సినిమాలలో నటించే అవకాశం ఇచ్చారు. "భక్త కుచేల", "బాలయోగిని", "తిరునీల కంఠర్" వంటి చిత్రాలలో ఆమె నటన, గానం ప్రేక్షకుల మనసులను కట్టిపడేసింది. సంగీతం, నటన రెండింటిలోనూ సమానంగా నైపుణ్యం చూపిన ఆమె దక్షిణ భారత సినీ రంగంలో అరుదైన ప్రతిభగా నిలిచారు.



1943లో విడుదలైన "భాగ్యలక్ష్మి" చిత్రం ఆమె జీవితంలో మైలురాయిగా నిలిచింది. ఈ చిత్రానికి ఆమె పాడిన "తిన్నెమీద సిన్నోడా" పాటే తెలుగు సినీ చరిత్రలో తొలి ప్లేబ్యాక్ సాంగ్‌గా నిలిచింది. అంటే తెరపై నటించే పాత్రకు వెనుకనుండి మరొక గాయని స్వరం వినిపించడం అనే ఆవిష్కరణ తొలిసారిగా ఆ సినిమాతో జరిగింది. ఈ సరికొత్త ప్రయత్నం తెలుగు సినిమా సంగీత ప్రపంచానికి కొత్త మార్గం తెరిచింది. ఆ తర్వాత ప్లేబ్యాక్ సింగింగ్ తెలుగు సినిమా యొక్క అంతర్భాగంగా మారింది. ఈ విధంగా బాలసరస్వతీ దేవి పేరు తెలుగు సినిమా చరిత్రలో శాశ్వతంగా చెక్కబడి నిలిచిపోయింది.

సినీ రంగంతో పాటు, ఆమె ఆకాశవాణి (రేడియో) వేదికపైన కూడా విస్తృత సేవ అందించారు. ఆమె తొలి 'లలిత సంగీత' గాయని. ఆమె పాడిన తీయని పాటలు ఆ సమయంలో లక్షలాది తెలుగు కుటుంబాల చెవుల్లో మోగేవి. రేడియో ద్వారా ఆమె స్వరం ప్రతి ఇంటికీ చేరి సంగీతానందాన్ని పంచింది. తెలుగు, తమిళ సినిమాలలో దశాబ్దాల పాటు ఆమె గానం వినిపించింది. అదేవిధంగా హిందీ, కన్నడ చిత్రాలలో కూడా ఆమె స్వరం ప్రతిధ్వనించింది.

బాలసరస్వతీ దేవి గానం మృదుత్వం, శ్రావ్యత, భావప్రధానత కలగలిపినదై ఉండేది. ఆమె స్వరంలో ఉన్న సహజమైన మాధుర్యం విన్నవారిని మంత్ర ముగ్ధులను చేసేది. సంగీతం పట్ల ఆమెకున్న భక్తి, కృషి, సాధన, శ్రమ వల్లే ఆమె ఈ స్థాయికి చేరుకున్నారు. సాంప్రదాయిక సంగీతాన్ని ఆధునిక సినీ సంగీతంతో మిళితం చేయగలిగిన తొలి మహిళా గాయని అని చెప్పడం అతిశయోక్తి కాదు.

ఆమె సాధించిన ఘనతలకు గుర్తింపుగా 2023లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు"ను ప్రకటించింది. ఈ అవార్డు ఆమెకు సంగీత ప్రపంచంలో చేసిన విశేష కృషికి గౌరవ సూచకంగా ఇచ్చినది. 2025 అక్టోబర్ 15న 97 ఏళ్ల వయసులో ఆమె హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆమె మరణం తెలుగు సంగీత ప్రపంచానికి అపార నష్టం.

రావు బాలసరస్వతీ దేవి జీవితమంతా సంగీతం పట్ల ప్రేమ, కృషి, సమర్పణతో నిండిపోయింది. ఆమె స్వరం కాలానికి అతీతమై, తరతరాల చిన్నారులు, సంగీతప్రియులు గుర్తుంచుకునే రాగమవుతుంది. ఆమె జీవితం ప్రతి సంగీతాభిమానికి స్ఫూర్తిదాయకం. ఒక గాయని మాత్రమే కాదు, సంగీతానురాగం అంటే ఏమిటో చూపించిన సజీవ ప్రతిరూపం.

– సువేగా

# Oxford
## Grammar High School

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE





# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI**, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com